

నగరోత్సవంలో రాజరాజేశ్వరి అమ్మవారు

నెల్లూరు రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు





అల్లూరు : పోలేరమ్మకు నిర్వహించిన పల్లకిసేవ



బుచ్చి : అశ్వవాహనంపై గ్రామోత్సవంలో జొన్న వాడ కామాక్షితాయి



సంగం : బాలచౌడేశ్వరిదేవి గ్రామోత్సవం



నెల్లూరులో కన్యకాపరమేశ్వరి నగరోత్సవం

విజయలక్ష్మిగా అమ్మవార్ల దర్శనం

సంప్రదాయబద్ధంగా విజయదశమి వేడుకలు

నూతన వ్యాపారాల ప్రారంభం ● ఆలయాల వద్ద వాహన పూజలు

దేవాలయాలకు భారీగా తరలివచ్చిన భక్తులు



కావలిటౌన్ : గౌరీదేవి అలంకారంలో దుర్గాభ్రమరాంబ

నెల్లూరు (సాంస్కృతికం)

అక్టోబరు 13 : జిల్లా వ్యాప్తంగా ప్రజలు శనివారం విజయదశమిని వైభవంగా జరుపుకున్నారు. అధర్మంపై విజయానికి గుర్తుగా ప్రతి ఒక్కరూ ఈ పండుగను నిర్వహించారు. విజయదశమి సందర్భంగా వివాహముహూర్తాలతోపాటు నూతన గృహాలు, కల్యాణ మండపాలు, నూతన వ్యాపార సంస్థలు ప్రారంభమయ్యాయి. పోలీస్ స్టేషన్లలో ఆయుధ పూజలు, వ్యాపార సముదాయాల్లో యంత్రాలకు పూజలు నిర్వహించారు. భారీగా కొత్త వాహనాల కొనుగోళ్లతోపాటు ఆలయాల వద్ద వాహన పూజలు జరిగాయి. జిల్లాలోని వివిధ ఆలయా ల్లో అమ్మవార్లు విజయలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో శమీ పూజలు, చిన్నారులకు కన్య పూజలు, అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు, బాణసంచా వేడుకలు, మంగళవా యిద్యాలు, నృత్యాలు, తీన్‌మార్ మ్యూజిక్కులు, కన్నుల పండువగా నగరోత్సవాలు నిర్వహించారు. నగరంలోని పలు ఆలయాలను మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ దంపతులు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, ఇతర ప్రజా ప్రతినిధులు సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పేదలకు వస్త్ర, అన్నదానం నిర్వహించారు. అమ్మవార్ల చల్లని చూపులతో సమృద్ధిగా వర్షాలు కురిసి, పాడి పంటలతో అభివృద్ధి చెందేలా ఆశీర్వదించాలని అమ్మవార్లకు సంకల్పం చేసుకున్నారు. మొత్తం మీద జిల్లాలో దసరా సంబరాలు అంబరాన్ని అంటాయి.



ఉదయగిరి రూరల్ : ఆయుధ పూజలో ఎస్‌ఐలు, సిబ్బంది





కందుకూరు : స్వర్ణాభరణాలతో భక్తులకు దర్శనమిచ్చిన అంకమ్మతల్లి

కన్యకా పరమేశ్వరి నగరోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు



నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రంలో వైన్ షాపుల డ్రా కోసం చేసిన ఏర్పాట్లు

నేడే మద్యం షాపులకు డ్రా

- 182 దుకాణాలకు 3872 దరఖాస్తులు
- కస్తూర్బా కళాక్షేత్రంలో కలెక్టర్ ఏర్పాట్ల పరిశీలన
- ఉదయం 8 నుంచి లాటరీ ప్రక్రియ ప్రారంభం

నెల్లూరు(క్రైం), **అక్టోబరు 13:** జిల్లా వ్యాప్తంగా 182 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించగా, 3872 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం ఉదయం 8గంటలకు నెల్లూరు నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో అధికారులు డ్రా తీసి వ్యాపారులకు దుకాణాలను కేటాయించనున్నారు. జిల్లాలోని వైన్‌షాపులకు అందిన దరఖాస్తులతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.77.44కోట్లు ఆదాయం వచ్చింది.

● జిల్లా కలెక్టర్ ఏర్పాట్ల పరిశీలన



కళాక్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో వైన్‌షాపుల లాటరీ ప్రక్రియకు ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లు చేయగా, ఆదివారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కీ డ్రాలో ఎలాంటి అవకతవకలకు, వివాదాలకు తావులేకుండా ప్రశాంతంగా పూర్తి చేయాలన్నారు. ఎక్సైజ్ అధికా రులు ఉదయం 8గంటలకు డ్రా ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. ఆయా ప్రాంతాల వారీగా ఉన్న దుకాణాలు, వాటికి వచ్చిన దరఖాస్తులు, వాటికి కేటాయించిన నెంబర్ల ఆధారంగా లక్కీ డ్రా తీసే బాక్సులో వేసి అధికారుల సమక్షంలో ఒక్కో షాపునకు ఒక్కో టోకన్ తీసి వ్యాపారులకు లైసెన్సును అందజేయనున్నారు. ఈప్రక్రియను అంతా వీడియో రికార్డింగ్ చేస్తారు. డ్రాలో వ్యాపారులు షాపు పొందిన తరువాత బ్యాంకు కౌంటరుకు వెళ్లి లైసెన్సు ఫీజు చెల్లించి షాపును ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు చేపడతారు. దుకాణం ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారన్న సమాచారాన్ని మంగళవారం ఎక్సైజ్ అధికారులకు తెలియజేస్తే, వారు ఆప్రాంతాలను పరిశీలించి దుకాణం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. 16వతేదీ ఉదయం నుంచి మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు. కస్తూర్బా కళాక్షేత్రం వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ట్రాఫిక్, సివిల్ పోలీసులతో ఎక్సైజ్ అధికారులతో సమావేశమయ్యారు.

ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వారీగా దుకాణాలు, దరఖాస్తుల వివరాలు

ఎక్సైజ్ స్టేషన్	మొత్తం షాపులు	వచ్చిన దరఖాస్తులు	ఒక షాపునకు వచ్చిన దరఖాస్తుల శాతం
ఆత్మకూరు	13	320	24.62
నెల్లూరు-1	30	733	24.43
కలిగిరి	11	257	23.36
పొదలకూరు	17	387	22.76
కందుకూరు	17	378	22.24
ఇందుకూరుపేట	18	398	22.11
నెల్లూరు-2	12	265	22.08
కోవూరు	21	406	19.33
బుచ్చి	14	259	18.5
కావలి	17	277	16.29
ఉదయగిరి	12	192	16
మొత్తం	182	3872	21.27

తుఫాన్ ప్రభావంతో నేటి నుంచి భారీ వర్షాలు

మూడు రోజులపాటు కురిసే అవకాశం

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- వెబెక్స్ సమావేశంలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), **అక్టోబరు 13:** బంగాళాఖాతంలో అల్పపీడనం, తుఫాన్ ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిందని కలెక్టర్ ఆనంద్ చెప్పారు. ఆదివారం ఆయన వెబెక్స్ ద్వారా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం (నేటి నుంచి) బుధవారం వరకు మూడు రోజులపాటు జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలు, తుఫాన్ వచ్చినట్లయితే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోడానికి అధికారులంతా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

● పెన్నానది గట్లను పరిశీలించాలి

పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖల అధికారులు పెన్నా నది గట్లను పరిశీలించాలన్నారు. గట్లు బలహీనంగా ఉన్నా, గండ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పెన్నాకి వరద వస్తే నదీ పరివాహక ప్రాంతంలో ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. యజమానులతో మాట్లాడి బోట్లు, ఎక్స్‌కవేటర్లను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. వాటి తరలింపునకు వాహనాలను, మనుషులను సిద్ధంగా చేసుకోవాలన్నారు. ప్రాణనష్టంకాని, పశునష్టం కాని జరకుండా చూడాలన్నారు.. నిత్యావసరాలు, ఆహార పదార్థాలు, పాలు, కూరగాయల వాహనాలు, డీజిల్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. గ్రామాల్లోని తాగునీటి ట్యాంకుల్లో ముందుగా నీటిని నింపుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

● తీరప్రాంత గ్రామాల్లో..

తీరప్రాంత గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా, మైక్‌లద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని చెప్పారు. భారీ వర్షాలు సంభవిస్తే సురక్షిత ప్రాంతాలకు ప్రజలు చేరుకోవాలన్నారు. తీర ప్రాంతాల్లో పూరి గుడిసెలు, తాటాకు ఇళ్లలో ఉండే ప్రజలు పక్కా భవనాల్లోకి, తుఫాన్ షెల్టర్లలోకి వెళ్లాలన్నారు. వైద్యశాలల్లో అత్యవసర మందులు, పాముకాటుకు మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఆర్‌అండ్‌బీ, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదన్నారు. వేటకు వెళ్లి ఉంటే ఆదివారం సాయంత్రానికి తిరిగి సముద్రం బయటకు రావాలన్నారు.



వెబెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

● సెలవుల రద్దు

జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు సెలవుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేసుకుని హెచ్‌క్వార్టర్లలో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

● కంట్రోల్ రూము ఏర్పాటు

నెల్లూరు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ మూడు షిఫ్టులలో సిబ్బందికి డ్యూటీలు వేశామన్నారు. కంట్రోల్ రూమ్ నెంబర్లు 0851-2331261, 7995576699, 1077గా పేర్కొన్నారు. డివిజన్, మం డల కేంద్రాల్లో కూడా కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని ఆర్డీవోలు, తహసీల్దార్‌లను కలెక్టర్ ఆదేశించారు.

● నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు :

తుఫాన్ కారణంగా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కావేదిక కార్యక్రమాన్ని రద్దు చేశామని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఈ వెబెక్స్ సమావేశంలో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● మూడు మిల్లీమీటర్ల వర్షం

జిల్లాలో ఆదివారం మూడు మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా మర్రిపాడులో 32 మి.మీ, అత్యల్పంగా గుడ్లూరులో 2.2 మిమీ వర్షపాతం నమోదైంది.

విద్యుత్ శాఖ అప్రమత్తం : ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ) : జిల్లాకు తుఫాన్ ముప్పు ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో అధికారులందరినీ అప్రమత్తం చేసి, ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ తెలిపారు. ఆదివారం ఆయన చాంబర్ నుంచి జిల్లాలోని అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం జిల్లాపై అధికంగా ఉంటుందని, వాతావరణ శాఖ నుంచి హెచ్చ రికలు ఉన్నందున అన్ని ప్రాంతాల్లో అధికా రులంతా పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. షిఫ్ట్ అపరేటర్లు, కాంట్రాక్ట్, ప్రైవే టు సిబ్బందిని అందుబాటులో ఉంచు కోవాలన్నారు. ఏ ప్రాంతంలో ఇబ్బంది జరిగిన వెంటనే స్పందించేలా అధికారులందరూ అందుబాటులో ఉండాలన్నారు.



వేంకటేశ్వరస్వామికి వెండి కిరీటం బహూకరణ

లింగసముద్రం, **అక్టోబరు 13 :** స్థానిక ప్రసన్న వేంకటేశ్వరస్వామికి ఆదివారం అదే గ్రామానికి చెందిన వేంకటేశ్వర బేకరి యజమాని రాయళ్ల ప్రసాద్, ఆయన సతీమణి యామినిలు వెండి కిరీటం బహూకరించారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అడపా రంగయ్య, ప్రధాన అర్చకులు వెల్లటూరి రాధాకృష్ణ పాల్గొన్నారు.



ప్రసన్న వేంకటేశ్వరుడికి వెండి కిరీటం ఇస్తున్న రాయళ్ల ప్రసాద్ దంపతులు

'పల్లె పండుగ'తో గ్రామాలకు మహర్దశ

గ్రామాలకు మహర్దశ పట్టించేందుకు 'పల్లె పండుగ' పేరుతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. మంచినీటి ఎద్దడి, మురుగు, రోడ్ల తదితర సమస్యలను పరిష్కరించి పట్టణాలకు దీటుగా పల్లెలను దీర్చిదిద్దేందుకు రాష్ట్రవ్యాప్తంగా బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సోమవారం (14వ తేదీ) నుంచి 'పల్లె పండుగ' కార్యక్రమాన్ని ప్రారంభిస్తుండగా ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యులను చేశారు. ఇందుకోసం దాదాపు రూ.80 కోట్ల మేర పనులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలను రూపొందించారు.

- నెల్లూరు (జడ్పీ)

- నేటి నుంచి వారోత్సవాల నిర్వహణ
- ఏర్పాట్లపై అధికారుల ముమ్మర కసరత్తు
- జిల్లాలో రూ.80 కోట్ల పనులకు ప్రతిపాదనలు
- నియోజకవర్గాల వారీగా వర్క్‌ల గుర్తింపు

గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనకు ఈనెల 14 (నేటి) నుంచి పల్లె పండుగ పేరుతో వారోత్సవాలను నిర్వహించనున్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే నిధులతో ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించి పల్లెల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. దీనిపై ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. జిల్లావ్యాప్తంగా 735 గ్రామ పంచాయతీల్లో వారోత్సవాల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. రోజువారీగా ఏ ఏ కార్యక్రమాలు నిర్వహించాలి, ఏ పనులకు శంకుస్థాపనలు చేయాలన్న ప్రణాళికలను సిద్ధం చేసి,



స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించారు. ఉపాధి హామీ, పంచాయతీ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు సమన్వయంతో ఈ ఏర్పాట్లను చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో చేపట్టే పనులు, పల్లెపండుగ కార్యక్రమాలు తదితర వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక బోర్డులు కూడా ఏర్పాటు చేయనున్నారు.

● భారీగా ప్రతిపాదనలు

ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.80 కోట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు పెద్దఎత్తున చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో నియోజవర్గాల వారీగా చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు తయారు చేసి అధికారులకు పంపుతున్నారు. మంచినీటి ఎద్దడిని నివారణకు చెక్ డ్యాంలు, నీటి గుంతలు, వాటర్ షెడ్లు, గ్రామాల్లో సిమెంటు రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, సాగునీటి పంట కాలువల అభివృద్ధి చేయడం తదితర పనులు చేసేలా ప్రభుత్వం సూచించింది. వచ్చే మార్చి నాటికి ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో జనవరి కల్లా పనులను పూర్తి చేసేలా ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది.

మినీ స్టేడియం శిలాఫలకం ధ్వంసం

● ప్రమాదవశాత్తు కూలిపోయిందా.. కావాలని పడగొట్టారా?



కావలి మినీ స్టేడియంలో ధ్వంసమైన శిలాఫలకం

కావలి, అక్టోబరు 13: పట్టణ ఉదయగిరి రోడ్డులోని మినీ స్టేడియంలో స్టేడియం నిర్మాణానికి 23ఏళ్ల కిందట అధికారులు శిలాఫలకం ఏర్పాటు చేశారు. ఆదివారం అది కిందపడి పగిలిపోయి కనిపించింది. ఈ శిలాఫలకం ప్రమాదువశాత్తు కూలిపోయిందా లేక కావాలని ఎవరైనా పగుల కొట్టారా అనే చర్చ కావలిలో జరుగుతోంది. స్టేడియంలో ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లిన వారికి ఎవరికీ అక్కడ శిలాఫలకం పడిపోయినట్లు కనిపించలేదు. సాయంత్రానికి శిలాఫలకం దిమ్మె కింద పడి ముక్కలు ముక్కలుగా కనిపించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో 2021 ఫిబ్రవరి 10వ తేదీన అక్కడ స్టేడియం నిర్మాణానికి అప్పటి కావలి ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన ఉమ్మడి రాష్ట్ర హోంమంత్రి దేవేందర్‌గౌడ్ శంకుస్థాపన చేశారు. అప్పటినుంచి నిర్మాణానికి పలు ప్రతిపాదనలు పంపగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పరిపాలనా శాఖ భవన నిర్మాణం చేపట్టగా అప్పటి కావలి ఎమ్మెల్యేగా ఉండిన వైసీపీకి చెందిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అభ్యంతరం చెప్పి పనులు ఆపించారు. అంతలో ప్రభుత్వం మారి వైసీపీ ప్రభుత్వం రావటంతో దాన్ని ఎవరూ పట్టించుకోక పోవటంతో నిర్మాణం అలాగే ఆగిపోయిది. మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి రాం ప్రసాద్‌రెడ్డిని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి కలిసి స్టేడియం నిర్మాణం నకు నిధులు మంజూరు చేయమని కోరారు. ఆయన స్పందించి ప్రతిపాదనలు పంపాలని కోరారు. ఇంతలోనే శిలా ఫలకం ధ్వంసం కావటంతో అది ప్రదావశాత్తు లేక ఉద్దేశ్యపూర్వకమా అనేది తెలియటంలేదు. స్టేడియంలో డ్రైవింగ్ నేర్చుకునే వాహనాలు తగిలి పడి పోయిందా లేక అక్కడ ఆదివారం క్రికెట్ ఆడటానికి వచ్చిన పిల్లలు సరదాగా నెట్టితే ఏమైనా పడి పోయిందా అనేది అర్థం కావటం లేదు.

డంపింగ్ యార్డులో పీసీబీ చైర్మన్ కృష్ణయ్య పరిశీలన



డంపింగ్ యార్డు వద్ద చెత్తను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు(సిటీ), అక్టోబరు 13 : కాలుష్య నియంత్రణ బోర్డు(పీసీబీ) రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కృష్ణయ్య నెల్లూరులోని డంపింగ్ యార్డులను ఆదివారం పరిశీలించారు. నగర కమిషనర్ సూర్యతేజతో కలిసి అల్లీపురం డంపింగ్ యార్డును సందర్శించారు. అక్కడ చెత్త నిల్వ చేయడాన్ని పరిశీలించిన అనంతరం అక్కడే ఉన్న ఎస్టీపీ (మురుగుశుద్ధి ప్లాంటు)ను తనిఖీ చేశారు. దాని పనివిధానం, ప్రయోజనాలను అధికారులు ఆయనకు వివరించారు. ఆ తర్వాత పాతమున్సిపల్ కార్యాలయంలో ఉన్న చెత్త నిర్వహణ యంత్రాలను పరిశీలించారు. నగరంలో నిత్యం జరిగే చెత్త సేకరణ విధానాన్ని కృష్ణయ్యకు నగర కమిషనర్ వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరే షన్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నెల్లూరు రూరల్, అక్టోబరు 13 : నెల్లూరు - ముత్తుకూరు రహదారిపై నారాయణ ఆసుపత్రి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ధనలక్ష్మీపురం నుంచి నెల్లూరుకు వస్తున్న స్కూటర్ రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని ఢీకొనడంతో అతనికి తీవ్రగాయాలై మరణించాడు. మృతుని ఆచూకీ తెలియాల్సి ఉందని, ప్రమాదానికి కారణమైన వ్యక్తి వివరాలు కూడా అందాల్సి ఉందని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బైక్ అదుపుతప్పి బ్యాంకు ఉద్యోగి దుర్మరణం



ఖాజారహంతుల్లా (ఫైల్)

ఉదయగిరి రూరల్, అక్టోబరు 13: రోడ్డు ప్రమాదంలో బ్యాంకు ఉద్యోగి మృతి చెందిన సంఘటన వింజమూరు మండలం చాకలకొండ గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకొంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఉదయగిరి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ ఖాజారహం తుల్లా(56) ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చాకలకొండ ఏపీజీబీలో డిప్యూటేషన్‌పై ఒక్కరోజు విధులు నిర్వహించేందుకు వెళ్లాడు. బ్యాంకులో విధులు ముగించుకొని స్వగ్రామమైన ఉదయగిరికి తన మోటార్‌బైక్‌పై బయలుదేరాడు. చాకలకొండ గ్రామ సమీపంలో మేకల మంద రోడ్డుకు అడ్డంగా రావడంతో ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడడంతో అతనికి తీవ్ర గాయమైంది. అటుగా వస్తున్న వారు గమనించి బ్యాంకు సిబ్బందికి సమాచారం అందించారు. వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం వింజమూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఉదయగిరిలో శనివారం జరిగిన ఆయన అంత్యక్రియలకు పలువురు బ్యాంకు ఉన్నతాధికారులు, ఉద్యోగులు హాజరై నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

● చికిత్స పొందుతూ యువకుడు...

కావలి రూరల్, అక్టోబరు 13: గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన చౌదరి పాలెం కోడెల సాయి కార్తీక్ (26) నెల్లూరులో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. మృతుడికి ప్రకాశం జిల్లా పుల్లల చెరువు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మీతో ఏడాది కిందట వివాహమైంది. వీరికి నెల క్రితం బాబు జన్మించగా పుట్టింటిలో ఉన్న భార్య ను కాపురానికి రమ్మని సాయి కార్తీక్ కోరగా మూడో నెలలో వస్తానని చెప్పటం తో మనస్తాపం చెంది ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ బాలక్రిష్ణ కేసు నమోదు చేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వెంకటాచలం, అక్టోబరు 13 : మండలంలోని కాకుటూరు పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ముందుగా అందిన సమాచారం మేరకు సీఐ పోతుగుంట సుబ్బారావు తన సిబ్బందితో కలిసి పేకాటస్థావరంపై దాడి చేసి ఆరుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1000 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గిరిజన మహిళపై అత్యాచారయత్నం

మనుబోలు, అక్టోబరు 13: మండలంలోని అక్కంపేటకు చెందిన మంద పోలయ్య తనపై అత్యాచారయత్నానికి పాల్పడినట్లు అదే గ్రామానికి చెందిన గిరిజన వివాహిత (19) ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు.. శనివారం రాత్రి పోలయ్య పూటుగా మద్యం సేవించి ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆమెపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఆమె నిరాకరించడంతో హత్య చేసేందుకు దిండుతో ఆమె ముఖంపై అదమబోయాడు. దీంతో ఆమె కేకలు వేయగా చుట్టుపక్కల వారు రావడంతో పోలయ్య పారిపోయాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాకేష్ ఆదివారం గ్రామానికి వెళ్లి స్థానికులను విచారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా గిరిజన వివాహితపై అత్యాచార యత్నానికి పాల్పడిన పోలయ్యను ఈ ఏడాది ఫిబ్రవరిలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడుగా నియమితులయ్యారని గ్రామస్థులు తెలిపారు. అయితే దీనిపై కాంగ్రెస్ జిల్లా నాయకుడు పంటా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ పార్టీలో ప్రస్తుత కమిటీలు రద్దు చేశామని, పోలయ్యను ఎప్పటి నుంచో సస్పెండ్ చేసి ఉన్నామని, ఆయన్యకు కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేదని తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	143
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	254
స్కిన్‌లెస్	280
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7334
వెండి కిలో ధర	రూ. 93,600
వెండి ఒక గ్రాము	రూ. 96.60

పరిశ్రమల పరుగు

● జిల్లాకు భారీ పరిశ్రమల రాక
● పోర్టుల అనుసంధానంగా ఏర్పాటుకు చర్యలు
● ఐదేళ్లలో రూ.1.25లక్షల కోట్ల పెట్టుబడులు
● రూ.60 వేల కోట్లతో హిందుస్థాన్ పెట్రోలియం
● రూ.43 వేల కోట్లతో ఇండోసోల్ సోలార్ లిమిటెడ్
● వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 13 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో పారిశ్రామిక రంగానికి నూతన ఉత్తేజం వచ్చినట్లైంది. గత వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు, వేధింపులతో కుదేలైన ఈ రంగానికి పూర్వ వైభవం తెచ్చే దిశగా ప్రస్తుత ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇప్పటికే దేశంలో పేరున్న కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తుండగా వాటిలో నెల్లూరు జిల్లాలోనే దాదాపు రూ.లక్ష కోట్లకుపైగా పెట్టుబడులు పెట్టేందుకు 9 కంపెనీలు రానున్నాయి. ప్రధానంగా కృష్ణపట్నం, రామాయ పట్నం పోర్టులతోపాటు సీబీఐసీ, వీసీఐసీ కారిడార్ల అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. దీంతో దిగ్గజ కంపెనీలు జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందు కొస్తున్నారు. ఆయా పరిశ్రమలకు అవసరమైన భూమిని సేకరించే ప్రక్రియను ఇప్పటికే ఏపీఐఐసీ ప్రారంభించింది. మొదటగా రామాయపట్నం పోర్టుని అనుకొని దాదాపు 2500 ఎకరాలను అధికారులు గుర్తించారు. అక్కడ భారీ ఇండస్ట్రీయల్ హబ్ ఏర్పాటుకు రాష్ట్రం ప్రభుత్వం సిద్ధమవుతోంది. కాగా, ఇదే ప్రాంతంలో దాదాపు 2000 ఎకరాల్లో రూ.60 వేల కోట్ల పెట్టుబడు లతో హిందుస్థాన్ పెట్రోలియం రిఫైనరీ పరిశ్రమ, రూ.43 వేల కోట్లతో ఇండోసోల్ సోలార్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు కానున్నాయి. ఈ నేపథ్యంలో మరింత భూసేకరణ పై ఏపీఐఐసీ దృష్టి పెట్టింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం పలు రాయితీలతో పారిశ్రామిక వేత్తలను ఆకర్షిస్తుండటంతో మరికొన్ని భారీ పరిశ్రమలు కూడా జిల్లాకు వస్తున్నాయని సమాచారం. దీంతో రానున్న ఐదేళ్లలో పారిశ్రామికంగా జిల్లా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఈ నూతన పరిశ్రమల ఏర్పాటుతో ప్రత్యక్షంగా దాదాపు 10వేల మందికి, పరోక్షంగా 30వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.

వేగంగా భూసేకరణ చేస్తున్నాం

జిల్లాలో నూతన పరిశ్రమల కోసం వేగంగా భూసేకరణ చేస్తున్నాము. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏపీఐఐసీ వద్ద ఉన్న భూ బ్యాంకు చాలా వరకు తిరుపతి జిల్లాకు వెళ్లింది. దీంతో ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో ప్రధానంగా రామాయపట్నం పోర్టును అనుకొని భూసేకరణ చేస్తున్నాము. ఇప్పటికే దాదాపు 2500 ఎకరాలను గుర్తించాము. రాబోవు రెండేళ్లలో జిల్లాకు 10కిపైగా భారీ పరిశ్రమలు రానున్నాయి. వీటి ఏర్పాటుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది.

- వీరశేఖరరెడ్డి, ఏపీఐఐసీ జెడ్ఎం

జిల్లాలో ఏర్పాటు కానున్న నూతన పరిశ్రమలు....

పరిశ్రమపేరు	ప్రాంతం	పెట్టుబడులు (రూ.కోట్లలో)
● హిందుస్థాన్ పెట్రోలియం(రిఫైనరీ)	రామాయపట్నం	60,000
● ఇండోసోల్ సోలార్	రామాయపట్నం	43,000
● జాన్సన్ ఇన్‌ఫ్రా	రామాయపట్నం	10,000
● జేఎస్‌డబ్ల్యూ	రామాయపట్నం	5,000
● ఉత్కర్ష లిమిటెడ్	దగదర్తి(బీవీపాళెం)	4,500
● హెచ్‌పీసీఎల్	బోగోలు(జువ్వెలదిన్నె)	2,000
● క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ	వెంకటాచలం	725
● శ్రీచక్ర లిమిటెడ్	మనుబోలు	360
● విశ్వసముద్ర లిమిటెడ్	వెంకటాచలం	315

వైసీపీ వర్సెస్ టీడీపీ

● పోటాపోటీగా పంచాయతీ భవనానికి తాళాలు
● వారం రోజులుగా పారిశుధ్య పనులకు బ్రేక్
● మురికికూపంగా మారిన పొదలకూరు

పొదలకూరు, అక్టోబరు 13 : అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ నాయకులకు వారం రోజులుగా అంతర్యుద్ధం జరుగుతోంది. ప్రతిపక్షమైనా పంచాయతీ పాలక వర్గం తమదేకావడంతో వైసీపీ నాయకులు ఏ మాత్రం తగ్గడంలేదు. ఈ క్రమంలో పంచాయతీ భవనానికి ఇరుపార్టీల వారు తాళాలు వేసి, ఎవరి తాళాలు వారివద్ద ఉంచుకున్నారు. దీంతో పారిశుధ్యానికి సంబంధించిన పరికరాలన్నీ భవనంలోనే ఉండిపోవడంతో పనులకు బ్రేక్ పడింది. ఫలితంగా పొదలకూరులో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతూ మురికికూపంలో మారింది. దానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పొదలకూరు పాత పంచాయతీ భవనం స్థానంలో బిట్-2 సచివాలయం నిర్మాణంలో ఉండడంతో, మూడేళ్ల క్రితం పొదలూరు పంచాయతీ పరిపాలనంతా పట్టణంలోని ఎమ్మార్వో కాలనీలోని బిట్-1 సచివాలయంలో జరిగేది. అయితే పట్టణంలోని ప్రధాన వాటర్ ట్యాంక్ పక్కన మార్చి నెలలో గతంలో వెలుగు కార్యాలయం కోసం శంకుస్థాపన చేసి, రెండు దశాబ్దాలుగా సగం నిర్మాణమై అసంపూర్తిగా ఉన్న భవనాన్ని, కమ్యూనిటీ హాల్‌గా పేరు మార్చి నిర్మించారు. ఆ కమ్యూనిటీ హాల్ భవనాన్ని అన్న క్యాంటీన్ కోసం ఉపయోగించాలని టీడీపీ వర్గీయులు భావించగా, అది ఇష్టం లేని వైసీపీ వర్గీయులు పంచాయ తీ భవనం కోసం వాడుకోవాలని భావించారు. అయితే ప్రస్తుతం పొదలకూరులో వైసీపీ వర్గానికి చెందిన వారే సర్పంచు, ఉపసర్పంచు, వార్డు మెంబర్లుగా ఉన్నా రు. అధికారంలో ఉన్న టీడీపీ నాయకుల మాటను బేఖాతరు చేయకుండనే అప్పటికప్పుడే బిట్-1 సచివాలయం నుంచి పంచాయతీ కార్యాలయంలోని సామగ్రిని ఇష్టానుసారంగా కమ్యూనిటీ భవనానికి తరలించారు. అయితే దీన్ని టీడీపీ వర్గీయులు నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ కార్యాలయాన్ని మార్చారని, కార్యదర్శి లేకుండా, కొన్ని రికార్డులు పోగొట్టారని, వైసీపీ నాయకులకు పంచాయతీ కార్యాలయాన్ని మార్చే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నిస్తున్నారు. ఇష్టానుసారంగా పంచాయతీ కార్యాలయాన్ని కమ్యూనిటీ హాల్లోకి మార్చడమే కాకుండా వైసీపీ వర్గీయులు ఒక తాళాన్ని వేసి ఆ తాళాన్ని వారి దగ్గరే ఉంచుకున్నారని టీడీపీ వర్గీయులు మండిపడ్డారు. పంచాయతీ కార్యదర్శి సమక్షంలో జరగాల్సిన కార్యాలయ మార్పును వైసీపీ నాయకులు ఒక పద్ధతి ప్రకారం మార్చ లేదంటూ విమర్శించారు. ఎవరి అనుమతితో ఇలా చేశారో చెప్పాలని దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కూడా పంచాయతీ పాలక వర్గంపై టీడీపీ వర్గీయులు ఫిర్యాదు చేడంతో పాటు ఆ పంచాయతీ భవనానికి కూడా మరొక తాళం వేశారు. దీంతో వారం రోజులుగా భవనం లోపల ఉన్న పంచాయతీ పారిశుధ్య పరికరాలను తీసుకునే వీలు లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడ ఉండిపోయింది. దసరా నవరాత్రుల్లో కూడా పారిశుధ్యం పూర్తిగా లోపించింది. పొదలకూరు బస్టాండులో చెత్త పేరుకుపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలంతా పంచాయతీ పాలక వర్గంపై విమర్శలు గుప్పిస్తున్నారు. దీనిపైన ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పొదలకూరులో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.



పంచాయతీ భవనానికి వేసిన రెండు తాళాలు

ఉరి వేసుకొని యువకుడి బలవన్మరణం

అల్లూరు, అక్టోబరు 13: ఇందుపూరు సమీపంలోని పొలాల్లో ఆదివారం రాత్రి దళితవాడకు చెందిన పులి మునేష్ (23) ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఎస్ఐ కిషోర్‌బాబు కథనం మేరకు.. ఇంటి నుంచి సాయంత్రం సమయంలో బయటికి వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాకపోవడంతో సాధారణంగానే ఆలస్యంగా వస్తాడేమోనని కుటుంబ సభ్యులు భావించారు. అయితే సాయంత్రం 7గంటల సమయంలో పశువులు ఇంటికి రాలేదని కొందరు వాటిని వెతుక్కుంటూ ఇందుపూరు నుంచి పురిణికి పోవు మార్గం నుంచి పొలాల్లోకి రెండు కిలోమీటర్ల దూరంలోని తుమ్మచెట్టు వద్ద ఉరేసుకుని ఉండటాన్ని గమనించి గ్రామస్థులకు తెలిపారు. వారు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్ఐ కిషోర్‌బాబు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నాడు. విషయాన్ని తల్లిదండ్రులైన పులి కృష్ణ, పద్మలకు తెలపడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతికి గల కారణాలు తెలియలేదని ఎస్ఐ తెలిపారు.

సంగమేశ్వరాలయానికి స్థలవిరాళం



స్థలం పత్రాలను అందచేస్తున్న పద్మనాభరావు దంపతులు

సంగం, అక్టోబరు 13: సంగమేశ్వరాలయానికి సంగంలో దివంగత అక్కరాజు శ్రీదేవమ్మకు చెందిన రూ. 10 లక్షల విలువైన 8 అంకణాల స్థిరాస్థి స్థలాన్ని ఆమె కుమారుడు పద్మనాభరావు విరాళంగా అందచేశారు. ఆమేరకు శనివారం స్థలానికి సంబంధించిన పత్రాలను సంగమేశ్వరాలయ సిబ్బందికి ఆయన అందచేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు అక్కరాజు వెంకటరమణయ్య ద్వారా వారసత్వంగా తన తల్లికి సంక్రమించిన స్థిరాస్థిని ఆమె జ్ఞాపకార్థం సంగమేశ్వరునికి విరాళంగా అందచేయడం జరిగిందన్నారు. ఆలయ అధికారులు స్థలాన్ని కాపాడి ప్రతి ఏటా కార్తీక మాసంలో రెండవ సోమవారం తన తల్లి శ్రీదేవమ్మ కుటుంబ సభ్యుల పేరుతో అర్చన చేయాలని ఆలయ అధికారులను ఆయన కోరారు.

రీచ్‌లు లేనిచోట ఇసుకను డంప్ చేయండి

● సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య



మాట్లాడుతున్న దామా అంకయ్య

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 13 : జిల్లాలో ఇసుక రీచ్‌లు లేని ప్రాంతాల్లో ఇసుకను డంప్‌ను చేసి అక్కడ అవసరమైన వారికి పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఇసుక రీచ్‌లు లేని ప్రాంతాల ప్రజలకు ఇసుక కావాలంటే లారీ, ట్రాక్టర్ బాడుగ ఎక్కువ అవుతోందని చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని సామాన్యులకు సైతం ఇసుకను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరారు. అధికార పార్టీ నేతలు వారికి అవసరం లేకపోయినా తమ పేరుమీద ఇసుకను బుక్ చేసుకుని అధిక ధరలకు అమ్ముకుంటు న్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేత షాన్‌వాజ్ తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మెన్ల దసరా చందాల దందా

● ఇంటికి రూ.50 నుంచి రూ.100 వరకు..
● రొయ్యల గుంటకు రూ.వెయ్యి నుంచి రూ.2వేలు వసూలు

విడవలూరు, అక్టోబరు 13 : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అవినీతి రహిత పాలన సాగిస్తుంటే విద్యుత్ శాఖ అధికారులు మాత్రం దసరా పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ శాఖకు సంబంధించిన లైన్‌మెన్‌లు మామూళ్లు దండుకుంటూ ఇవ్వకపోతే మీ సంగతి మేము చూసుకుంటామని బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో చేసేదే మీలేక విద్యుత్ వినియోగదారులు లైన్‌మెన్‌లకు మామూళ్లు సమర్పించుకుంటునట్లు సమాచారం. మండలంలోని విడవలూరు, ఊటుకూరు సబ్‌స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్‌లు దసరా పేరుతో ఒక్కో ఇంటికి రూ.50 నుంచి రూ.100 వసూలు చేయడమే కాకుండా ఆక్వా రైతుల వద్ద ఎకరాకు రూ.వెయ్యి నుంచి రూ.2వేలు వరకు దసరా మామూళ్ల వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఒకవేళ నిరాకరిస్తే వారిని బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఇలా వసూలు చేసిన మామూళ్లు లైన్ ఇన్‌స్పెక్టర్ నుంచి జిల్లా ఉన్నతాధికారుల వరకు పంచుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. లైన్‌మెన్‌ల అక్రమ వసూళ్లపై ఫిర్యాదు అందిన అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని, దీంతో మండలంలో దసరా పండుగ పేరుతో సుమారు రూ.5లక్షలు విద్యుత్ శాఖకు సంబం ధించిన సిబ్బంది వసూళ్లు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి తగిన విచారణ జరిపి అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి వీఎస్‌యూలో అడ్మిషన్లు

వెంకటాచలం, అక్టోబరు 13 : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో సోమవారం నుంచి ఐసెట్, పీజీ సెట్, ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ, డిగ్రీ హానర్స్ కోర్సులకు స్పాట్, మేనేజ్‌మెంట్ సీట్లకు అడ్మిషన్లు ప్రారంభమవుతాయని వీఎస్‌యూ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ హనుమారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌బీ సాయినాథ్‌లు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పీజీ సెట్ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులతోపాటు పీజీసెట్ రాయని అభ్యర్థులు కూడా ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. కాకుటూరులోని వర్సిటీ కళాశాలలో బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మైక్రోబయాలజీ, కామర్స్, కంప్యూటర్ సైన్స్, ఫుడ్ టెక్నాలజీ, మెరైన్ బయాలజీ, మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషల్ వర్క్, స్టాటిస్టిక్స్, తెలుగు వంటి పీజీసెట్ కోర్సులతోపాటు ఎంబీఏ, ఎంబీఏ టూరిజం, ఎంసీఏ, ఎంఎల్ఎస్ వంటి ఐసెట్ కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే కావలి పీజీ సెంటర్‌లో బోటనీ, జువాలజీ, కామర్స్, ఎకనామిక్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్ వంటి పీజీసెట్ కోర్సులతోపాటు ఎంబీఏ, ఎంసీఏ వంటి ఐసెట్ కోర్సులు ఉన్నాయఇ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం స్పాట్ అడ్మిషన్లకు ఫీజు రియింబర్స్‌మెంట్ వర్తించదని తెలిపారు. విద్యార్థులు సోమవారం నుంచి ఈనెల 19వ తేదిలోపు వీఎస్‌యూలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం 9441599597, 9989353455లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి ఎడ్లబండి పోటీలు



అల్లూరు మండలం గోగులపల్లి వాసికి ప్రథమ బహుమతి అందచేస్తున్న నిర్వాహకులు

విడవలూరు, అక్టోబరు 13: మండలంలోని వరిణి పంచాయతీలో దసరా పండుగను పురస్కరించుకుని ఆదివారం ఎడ్లబండి లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 18 జతలు ఎడ్ల యజమానులు పాల్గొన్నారు. ఆసక్తికరంగా జరిగిన ఈ పోటీల్లో ప్రథమ బహుమతి అల్లూరు మండలం గోగులపల్లి, ద్వితీయ బహుమతి అల్లూరు మండలం ఉడ్‌హౌస్‌పేట ఎడ్లు విజేతలుగా నిలిచాయి. విజేతలకు స్థానిక టీడీపీ నేతలు తూళ్లూరు మాధవ్, తిరుపతయ్య, రఘు, రేషన్ షాపుల డీలర్ వేణు బహుమతులు అందజేశారు.

వీఆర్‌ఏల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 13 : నెల్లూరు జిల్లా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. నెల్లూరులోని ఏపీఆర్ఎస్ఏ కార్యాలయ ప్రాంగణంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా ట్రెజరర్, ఎల్ రామ్మోహన్ అధ్యక్షతన కమిటీని ఎన్నుకు న్నారు. జిల్లా అధ్యక్షుడిగా కావలి ప్రేమ్‌దాస్, ప్రధాన కార్యదర్శిగా జీ నర సింహమూర్తి, ఉపాధ్యక్షుడిగా రామిశెట్టి మురళీకృష్ణ, ట్రెజరర్‌గా డీ ఆనంద్‌సుదర్శన్, సహాధ్యక్షుడిగా ఏలూరు బుజ్జయ్యను ఎన్నుకున్నారు.

టెట్‌కు 616 మంది హాజరు

నెల్లూరు (విద్య), అక్టోబరు 13 : ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు ఆదివారం జిల్లా వ్యాప్తంగా 616 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కావలి రామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం జరిగిన పరీక్షకు 110 మంది హాజరుకావాల్సి ఉండగా 92 మంది హాజరయ్యారు. నెల్లూ రు రూరల్‌లోని ఆయాన్ డిజిట్ జోన్‌లో జరిగిన పరీక్షకు 486 మంది హాజరు కావాల్సి ఉండగా 430 మంది హాజర య్యారు. అలాగే మధ్యాహ్నం రెండో సెషన్‌లో కావలి రామిరెడ్డి సుబ్బరామి రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు 110 మంది హాజరుకావాల్సి ఉండగా 94 మంది హాజరయ్యారు. మొత్తం 706 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 616 మంది హాజరయ్యారు. 90 మంది గైర్హాజరయ్యా రు. ఈ పరీక్షలను జిల్లా పరిశీలకుడు, రాష్ట్ర ఓపెన్‌స్కూల్ డైరెక్టర్ కే నాగేశ్వర రావు, డీఈవో రామారావు, విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

సోమశిలలో 52.168 టీఎంసీల నీరు

అనంతసాగరం, అక్టోబరు 13: సోమశిల జలాశయా నికి ఎగువ నుంచి ఆదివారం 8,969 క్యూసెక్కుల ప్రవా హం వస్తోంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ 77.988 టీఎం సీలు కాగా 52.168 టీఎంసీలుగా నమోదైంది. కండలేరుకు 8,500, ఉత్తర కాలువకు 540, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కులు సరఫరా చేస్తుండగా డెల్టాకు సరఫరా చేస్తున్న నీటిని ఉన్నతాధికారుల ఆదేశాలతో నిలుపుదల చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు.

వైభవంగా దసరా వేడుకలు

- అమ్మవారికి ప్రత్యేక పూజలు
- ఊరూరా గ్రామోత్సవాలు


ఆత్మకూరు: శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణలో జ్వాలాముఖి అమ్మవారు


ఏఎస్ పేటలో అమ్మవారి గ్రామోత్సవం


అనంతసాగరం : సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

కావలి టౌన్, అక్టోబరు 13: పట్టణంలో జరిగిన దేవి శరన్నవరాత్రోత్సవాలు శనివారంలో ముగిశాయి. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారి ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించారు. కలుగోళశాంభవి అమ్మవారు గజవాహన సేవలందుకున్నారు. పాతూరు శివాలయం దురా భ్రమరాంబ గౌరీదేవిగా రాత్రి దర్శనం ఇచ్చారు. పరాశక్తి పరాత్పరుల శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. విష్ణాలయం రాజ్యలక్ష్మీ విజయలక్ష్మీగా వడ్డెపాలెం కనకదుర్గాదేవి రాజరాజేశ్వరిదేవిగా, ముసునూరు మహాలక్ష్మమ్మ ధనలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ముసునూరు హనుమత్ క్షేత్రంలో దుర్గాదేవి రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు.

●**బిట్రగుంట:** కోవూరుపల్లిలోని పోలేరమ్మకు నెల్లూరు వేదాయపాలెంకు చెందిన దువ్వూరు గోవర్ధన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శివజ్యోతిలు పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో మాజీ సర్పంచు చిట్టిమూరి నీలిమ్మ మల్లికార్జునరెడ్డి దంపతులు భక్తులకు అన్నసంతర్పణ చేపట్టారు. బోగోలు సాయిమందిరలో రాజరాజేశ్వరికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయిబాబా సమాధి కార్యక్రమ ఉత్సవాలు సాయి సేవకులు నిర్వహించారు. విశ్వనాథరావుపేట కోదండరామాలయంలో రాజరాజేశ్వరికి భక్తులు పూజలు చేశారు.

●**కందుకూరు:** దసరా ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి అంకమ్మ తల్లి పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అంతముందు అంకమ్మ తల్లి స్వర్ణాభరణాలతో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కాను కుల రూపంలో ఇచ్చిన 330 గ్రాముల బంగారం ఇచ్చారు.

●**ఆత్మకూరు:** విజయదశమి సందర్భంగా శనివారం పట్టణంలోని సత్రం సెంటర్‌లో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు కన్యకా పరమేశ్వరి అలంకరణలో శోభిల్లారు. ఉదయం భక్తులు, ఆలయ అర్చకులు జమ్మిచెట్టుకు పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి ఊరేగింపు మేళతాళాలు, బాణాసంచాతో పురవీధుల్లో కొనసాగింది. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. జ్వాలాముఖీ ఆలయంలో జగన్మాత శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణలో శోభిల్లారు. కాశీనాయన ఆశ్రమంలో అమ్మ వారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

●**ఉదయగిరి రూరల్:** విజయదశమి సందర్భంగా ఉదయగిరి పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయం, సంతానలక్ష్మీదేవి ఆలయాల్లో రాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించి గోత్రనామాలతో అర్చనలు చేయించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా, స్థానిక పోలీస్ స్టేషన్‌లో విజయదశమి పర్వదినం సందర్భంగా ఎస్‌ఐలు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాసుల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆయుధపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఉన్న ఆయుధాలు, వాహనాలను శుభ్రం చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ప్రజలకు ప్రసాదాలు పంచిపెట్టారు.

●**అనంతసాగరం:** మండలంలోని సోమశిల, అనంతసాగరం, అగ్రహారం, రేవూరు తదితర గ్రామాల్లో దసరా వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈసందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరికుంటపాడులో సీతారామలక్ష్మణ ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించి అనంతరం పారువేట నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

●**సంగం :** స్థానిక సంగమేశ్వరాలయంలో శనివారం రాత్రి కామాక్షిదేవి రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీసేవ నిర్వహించారు. స్థానిక రాళ్లచెలిక, కొత్తూరులో శ్రీ బాలచౌడేశ్వరిదేవి ఆలయాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. రాళ్లచెలికలో జ్యోతి మహోత్సవం నిర్వహించారు. అదేవిధంగా బాలచౌడేశ్వరిదేవిని సింహ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. గంగమ్మ ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయంలో ఎస్‌ఐ రాజేష్, సీఐ వేమారెడ్డి శనివారం ఆయుధ పూజ నిర్వహించారు. అదేవిధంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈ మన్మధరావు ట్రాన్స్‌ఫార్మర్‌లకు పూజలు నిర్వహించారు.

●**ఏఎస్ పేట :** స్థానిక శ్రీకృష్ణ మందిరంలో శనివారం దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

●**అల్లూరు :** శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. పట్టణ పరిధిలోని కన్యకా పరమేశ్వరి, పార్వతీ అమ్మవారు, కలుగోళమ్మ, పోలేరమ్మ, ఆలయాలతోపాటు శివాలయం, వేణుగోపాలస్వామి ఆలయం, నార్తుమోపూరులోని శివాలయం, మహాలక్ష్మమ్మ ఆలయం, ఇస్కపల్లిలోని గంగమ్మ ఆలయాల్లో శనివారం విజయదశమి పండుగను పుస్కరించుకొని ఆయుధ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లకీసేవలు, గ్రామోత్సవాలు నిర్వహించారు.

●**జలదంకి :** మండలంలోని అన్ని ఆలయాల్లో శనివారం ప్రత్యేకపూజలు జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సంస్థల్లో దసరా వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఆయుధపూజలో ఎస్‌ఐ లతీఫున్నీసా సిబ్బంది పాల్గొన్నారు.

●**కొండాపురం:** భీమవరప్పాడు గ్రామదేవతలు పోలేమ్మ, బంగారమ్మ, పోతురాజులకు ఆదివారం భక్తులు పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సాయిపేట పంచాయతీ కొత్తపాలెంలో మహాలక్ష్మమ్మకు భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు.

●**కలిగిరి :** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని భద్రకాళి అమ్మవారు రాజరాజేశ్వగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు సింహ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించచారు. ఆలయ ప్రాంగణంలో నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

బహిరంగ ప్రకటన

మా మేనత్త గారు **అయిన పచ్చవ పుల్లమ్మ, w/o నారయ్య** గారికి పిల్లలు లేనందున ఆమెకు ఒకేఒక తమ్ముడు మా తండ్రి గారు అయిన **మండవ వెంకటస్వామి నాయుడు s/o చిన్నప నాయుడు** అయినందున ఆమె జీవిత భరోసా కొరకు మరియు ఆమె భర్త తో కలసి మా కుటుంబములు రెండు ఉమ్మడిగా కలసి జీవించుచూ **వున్నందువలన పుల్లమ్మ** గారికి ఆమె తమ్ముడు వెంకటస్వామి నాయుడు గారు పసుపు, కుంకుమల క్రింద కొనియించి ఇచ్చినందు వలన ఆమె తదనంతరము ఆమె ఏకైక తమ్ముడు వెంకటస్వామి నాయుడు గారికి చెందునట్లుగా ఆమె యూపదాస్తిని,ఆమెకు చెందిన అయిన వల్లి రెవిన్యూ గ్రామ సర్వే **నంబర్ -180/1-2 మరియు 463/1-2ల** లో గల ఎకరంలు 4-59 సెంట్లు పొలమును, మరియు సందిపాడు గ్రామము లో ఉన్న ఉమ్మడి ఇల్లులోని ఆమె భాగము ఆమె తన యావద ఆస్తి మొత్తము ను తన తమ్ముడు కి ఇచ్చినందువలన ఆమె మరణానంతరం రెవిన్యూ రికార్డులలో **వెంకటస్వామి నాయుడు s/o చిన్నప నాయుడు** పేరు సమోదైవున్నది (దాదాపు 25 సంవత్సరములుగా) సం 2005-2007 మధ్యకాలములో కొందరి వ్యక్తులకు కొంతపొలము అమ్మియున్నారు అయిన తదనంతరము నుండి నేను అనగా మండవ **వెంకట శ్రీనివాస నాయుడు s/o వెంకటస్వామి నాయుడు,** గారికి ఏకైక వారసుడు నైనందువలన 2007-2024 మధ్యకాలమున మరికొందరికి కొంత పొలము అమ్మియున్నాను కావున నా పేరున యిప్పుడు 1బి లో నమోదయినందువలన నా తండ్రి **వెంకటస్వామి నాయుడు** మరియు నేను (**వెంకట శ్రీనివాస నాయుడు**) అమ్మిన పొలము ను మా యిద్దరి సంతకములు తో వున్న అగ్రిమెంటులు ధ్రువీకరించిన తరువాత మీ ఖర్చులతో రిజిస్ట్రేషన్ చేసి యివ్వగలవాడను (అగ్రిమెంట్ల మీద మా యిద్దరి సంతకం ధ్రువీకరణ ముఖ్యమైన అంశముగ పరిగణించబడును) నా ఈ ఆస్తి విషయములో ఉదయగిరి కోర్టు లో **OS no.172/2008 కేసులో తేదీ 31-10-2014**న గౌరవ జడ్జి గారు యిచ్చిన జడ్జిమెంటు లో నా యజమానత్వం ధ్రువీకరించబడి వున్నది మరియు నేను వ్యాపారనిమిత్తము దూరప్రాంతములలో ఉంటున్నందువలన కోర్టుని ఆశ్రయించి **OS.39/2024 కేసులో తేదీ 11-07-2024**న ఉదయగిరి కోర్టు శాశ్వత ఇంజక్షన్ ఆర్డరు ఇచ్చివున్నారు కావున ఈ పై పొలములో ఎవరు ఎలాంటి అమ్మకములు ,దురాక్రమణ, అక్రమ కట్టడములు కట్టుటకు ప్రయత్నించినా నేను నా లాయరు ద్వారా తీసుకోను సివిల్ మరియు క్రిమినల్ కేసులకు చట్టపరిధిలో చట్టబద్ధముగా చర్యలకు బాధ్యులు అవుదురు.

పిటిషనర్ అడ్వకేట్
శ్రీనివాసులు సాలపక్షి., MBA., LL.B.,
Advocate,Nellore. Cell No. 99489 56437.

మాలకొండ ఆదాయం రూ. 14,90,441

వలేటివారిపాలెం, అక్టోబరు 13: మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ.14.90లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బి సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్లకు రూ. 12,450, కుంకుమార్చనతో రూ. 24,960, వివాహముల ద్వారా రూ.18 వేలు, తలనీలాలకు రూ. 65,650, వాహన పూజలతో రూ. 11,360, ప్రత్యేకదర్శనాకి రూ. 5,37,900, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ.660, రూముఅద్దెలు ద్వారా రూ.32,620, కవర్లు ద్వారా రూ. 10,500, లడ్డుప్రసాదానికి రూ. 2,44,220, అన్నదానం ద్వారా రూ. 4,66,889, విరాళాలతో రూ.65,232 ఆదాయం వచ్చినట్లు డీసీ సాగర్‌బాబు తెలిపారు.

మాలకొండ సన్నిధిలో ఎమ్మెల్సీ శ్రీకాంత్

మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చౌదరి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ సకల మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ ప్రత్యేక పూజలు చేసి శాలువా, పూలమాలతో సత్కరించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు మెరుగైన వసతులు కల్పనకు కృషి చేయాలని ఎమ్మెల్సీ కోరారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కమనీయం శ్రీవారి పుష్పయాగం


శ్రీవెంకటేశ్వర స్వామికి నిర్వహించిన పుష్పయాగం

కావలి టౌన్, అక్టోబరు 13: స్థానిక బృందావనం కాలనీలోని శ్రీవెంకటేశ్వర స్వామికి ఆదివారం ఉదయం పుష్పయాగం పూజలు నిర్వహించారు. సాయంత్రం వివిధ వాహనాలపై శ్రీవారి గ్రామోత్సవం చేపట్టారు. టీటీడీ అర్చక బృందం సభ్యులు చేపట్టిన ఉత్సవాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరామ్‌మాల్యాద్రి పర్యవేక్షించారు. శనివారం ఉదయం శ్రీవారికి పుష్కరిణిలో చక్రస్నాన సేవలందించారు. సాయంత్ర పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం, తిరుమంజనం తదితర పూజలు చేపట్టారు.

వైభవంగా వెంగమాంబ పల్లకీసేవ


పేరంటాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 13: విజయదశమి పర్వదినం సందర్భంగా శనివారం మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారి పల్లకీ సేవను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, కార్యనిర్వాహణాధికారి ఆధ్వర్యంలో అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన, మహానైవేద్యం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజులు చేపట్టి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా దమ్మచక్ర పరివర్తన్ దిన్

కావలి టౌన్, అక్టోబరు 13: స్థానిక అంబేద్కర్ కాలనీలోని బుద్ధవిహార్ వద్ద శనివారం (అశోక విజయదశమి) దమ్మచక్ర పరివర్తన్ దిన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా బ్లూ జెండాలు, పంచశీల జెండాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం బుద్ధవిహార్ వద్ద నున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బౌద్ధచార్య సంఘజ్యోతి పాల్గొని మాట్లాడారు. కావలి బుద్ధవిహార్ సంఘం బాధ్యులు జయప్రకాష్ దమ్మచక్ర పరివర్తన్ దిన్ విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో బీసీఎఫ్ కుడారి మస్తాన్, జెఏసీ అంబటి కొండలరావు, అంజనేయులు, శివప్రసాద్, మాలమహానాడు జేఏసీ ఛైర్మన్ దేవిప్రసాద్, మాలమహానాడు మహిళా ఛైర్మన్ మంచ మల్లీశ్వరి, ఉద్యోగ సంఘం ఛైర్మన్ అశోక్‌బాబు, పందు అశోక్‌బాబు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

జలదంకి, అక్టోబరు 13: వేములపాడులో పేకాట స్థావరంపై ఎస్‌ఐ లతీఫున్నీసా ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.6,300 నగదును స్వాధీనం చేసుకున్నారు.

గడ్డివామి దగ్ధం

బిట్రగుంట, అక్టోబరు 13: బోగోలు మండలం పాతబిట్రగుంటలో రేమాల క్రిష్ణారెడ్డికి చెందిన 12 ఎకరాల గడ్డివామి శనివారం మధ్యాహ్నం దగ్ధమైయ్యింది. గడ్డివామిలో మంటలు చెలరేగడం గుర్తించిన స్థానికులు పక్కన ఉన్న గడ్డివాములకు నిప్పు అంటకుండా చర్యలు తీసుకున్నారు. వెంటనే కావలి అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి : సీపీఎం


ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 13: రాష్ట్ర ప్రభుత్వం ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని ఆదివారం మండలంలోని బిజ్జంపల్లి గ్రామస్థులు ఖాళీ దబర్లు, బక్కెట్లు పట్టుకొని సీపీఎం ఆధ్వర్యంలో ఆం దోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ ఓవైపు వ్యవసాయం కలిసిరాక, మరోవైపు నిరుద్యోగ సమస్యలతో గ్రామీణప్రాంత ప్రజల జీవనం కష్టతరమైందని, ఈతరుణంలో అన్ని ర కాల వస్తువులు, నూనెల ధరలు మండుతుండంతో పేద, మధ్యతరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. ఆహార ధాన్యాలు సమృద్ధిగా ఉన్నప్పటికీ ఎన్నడూలేని విధంగా బియ్యం ధరలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ధరలను నియంత్రించాలని, లేదంటే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

నిర్వాసితులకు అన్ని వసతులు కల్పించాలి


ఇస్కపల్లి పీహెచ్‌సీని పరిశీలిస్తున్న ఆర్డీవో

అల్లూరు, అక్టోబరు 13: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఆదివారం కావలి ఆర్డీవో ఎం వంశీకృష్ణ మండలంలో పర్యటించారు. ఈసందర్భంగా ఇస్కపల్లి అనంతరం అల్లూరు రామకృష్ణ జూనియర్ కళాశాల గదులను పరిశీలించారు. కలెక్టరు ఆదేశాల మేరకు తుఫాను హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంతవాసులను ముందస్తు జాగ్రత్తగా అల్లూరుకు తరలిస్తామన్నారు. ఈ క్రమంలో వారికి అవసరమైన మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఐ ప్రభుదీప్, వీఆర్వోలు మల్లికార్జున, మనోహర్ పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే

కందుకూరు: అల్పపీడనం ప్రభావం ఉన్నందున రెండుమూడు రోజులు తీవ్ర ఈదుర గాలులతో పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో కార్యచరణ చేపట్టాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు విపత్తు సమయంలో ప్రజలకు అండగా ఉండాలని కోరారు.

తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి : ఏఈ

కావలి రూరల్: తుఫాను ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పట్టణ, రూరల్ విద్యుత్ ఏఈలు వసంత రావు, శ్రీనివాసులురెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీ ప్రాంతాలల్లో ఎక్కడైనా రోడ్ల ప్రక్కన చెట్లు ఒరిగి ఉంటే ఆ ప్రాంత లైన్‌మెన్‌కు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం కోసం సెల్: 94408 14289, 94408 12056 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకాధికారుల నియామకం

కలిగిరి: ఈ నెల 16 వరకు జిల్లాలో తుఫాను ప్రభావం దృష్ట్యా కలెక్టర్ల ఆదేశాల మేరకు 18 తేదీ వరకు మండల పరిధిలో ప్రత్యేక అధికారులను నియమించినట్లు తహసీల్దారు సిహెచ్.రవీంద్రబాబు తెలిపారు. లోతట్టు ప్రాంతాల వారిని, పూడి గుడిసెల్లో నివశించేవారిని ముందస్తు జాగ్రత్తగా సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాటు చేశామన్నారు.

కంట్రోల్‌రూం ఏర్పాటు

ఉదయగిరి రూరల్ : తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు సుభద్ర ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా తేదీల్లో కంట్రోల్‌రూంలో ఉద్యోగులు 24 గంటలు అందుబాటులో ఉంటారని, 9989502077 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

మండల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

సీతారామపురం: రానున్న మూడు రోజులు తుఫాను కారణంగా మండలంలో వర్షాలు పడే అవకాశం ఉందని మండలంలోని అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు కృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బంది తమ సచివాలయాల పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.

చికిత్స పొందుతూ లారీ డ్రైవర్ మృతి

ఉలవపాడు : స్థానిక బైపాస్ జాతీయ రహదారి కొల్లూరుపాడు వద్ద శనివారం రాత్రి మిరపకాయల లోడుతో వరంగల్ నుంచి తమిళనాడుకు వెళుతున్న లారీ డ్రైవర్ మురుగన్ గుణాలన్ (30)ను వెనుక వైపు నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయపడ్డాడు. క్షతగాత్రున్ని స్థానికులు గుర్తించి అతన్ని 108లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మరణించినట్లు తెలిపారు. ఎస్‌ఐ అంకమ్మ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఘనంగా వీరభద్రరావు జయంతి

బిట్రగుంట : సమాజం పచ్చదనం పరిశుభ్రతగా ఉంటే అందరం ఆరోగ్యంగా ఉంటామని పరిమి సీతారామయ్య అన్నారు. పరిమి వీరభద్రరావు 115 జయంతి సందర్భంగా ఆదివారం బోగోలు రాజవీధిలో ఆదివారం ఆయన 250 మామిడి మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరిమి పద్మశ్రీ, లైన్‌మెన్ రమేష్, స్థానికులు ఉన్నారు.

సమష్టిగా పోరాడితేనే రాజ్యాధికారం : బూదాటి

కావలి టౌన్, అక్టోబరు 13: అడుక్కుంటే అధికారం ఇవ్వరని సమష్టిగా పోరాడితేనే బీసీలకు రాజ్యాధికారం వస్తుందని మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య తెలిపారు. స్థానిక కోఆపరేటివ్ కాలనీలో శనివారం బీసీ ఐక్యతా భవన్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆర్టీసీ కూడలి ట్రంకురోడ్డులోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా కో ఆపరేటివ్‌కాలనీలో ఏర్పాటు చేసిన బీసీ ఐక్యతా భవన్‌కు చేరుకుని కార్యాలయాన్ని ప్రారంభించారు. భవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ఉపాధ్యక్షులు పోట్లూరు శ్రీనివాసులు, సోమశిల ప్రాజెక్ట్ కమిటి మాజీ ఛైర్మన్ కండ్లగుంట మధుబాబు నాయుడు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు శివాజి, బీజేపీ నేత బ్రహ్మానందం, భవన్ కార్యదర్శి చిన్నివరప్రసాద్, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజి పాల్గొన్నారు.

మంగుపల్లిలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ

అనంతసాగరం : మండలంలోని మంగుపల్లి ఎస్సీ కాలనీలో శనివారం అంబేడ్కర్ విగ్రహాన్ని నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ ఇరుబోతు వెంకటయ్య, నాయకులు దావా పెంచలరావు, నంద ఓబులేసు, వేము పెంచలయ్య, సర్పంచు కత్తి పెంచలయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సహాయం

కందుకూరు : విజయవాడ వరద బాధితులకు తమవంతు సహాయంగా పట్టణానికి చెందిన తల్లపనేని నరసింగరావు రూ.10వేలు, పంటవారిపాలెం మన్నం రమణయ్య రూ.10వేలు, మోపాడు తోకల రవికుమార్ రూ.10వేలను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు అందజేశారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి



గ్రామోత్సవంలో సీతాలమ్మ

అశ్వవాహనంపై విహరించిన కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 13: మండలంలోని జొన్నవాడ ఆలయంలో నిర్వహించిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఆలయం ఎదుట శమీ (జమ్మిచెట్టు)పూజ వైభవంగా జరిగింది. అనంతరం కామాక్షితాయి అశ్వవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఏకాంతసేవతో నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి.

వైభవంగా సీతాలమ్మ గ్రామోత్సవం

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కామాక్షికాల నీలో వెలసిన గ్రామ దేవత సీతాలమ్మకు నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన గ్రామోత్సవం ఆదివారం ఉదయం వరకు కొనసాగింది. అనంతరం భక్తులు వసంతాలు పోసుకుని సంబరాలు చేసుకున్నారు.



గాయత్రి అలంకరణలో దుర్గాదేవి

కొనసాగుతున్న దేవీ నవరాత్రులు

మనుబోలు, అక్టోబరు 13: మనుబోలులో మూడుచోట్ల దేవీ శరన్నవరాత్రులు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం మనుబోలు దసరా చావడిలో గాయత్రిదేవిగా దుర్గాదేవిని అలంకరించారు. 20ఏళ్ల తరువాత బలిజసంఘం దసరా నవరాత్రుల్లో ఉభయ దాతగా వ్యవహరించింది. కోదండరామపురంలో నెలకొల్పిన దుర్గాదేవి అమయ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవరాల ప్రసాద్‌రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. సోమవారం రెండు చోట్ల దుర్గాదేవి గ్రామోత్సవాలు నిర్వహించనున్నారు.

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం

రాపూరు, అక్టోబరు 13 : దసరా పండుగ సందర్భంగా స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 8గంటలకు అమ్మవారి లడ్డు వేలంపాట జరిగింది. తదుపరి గ్రామోత్సవం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో బాబా మహాసమాధి ఆరాధన

పొదలకూరు, అక్టోబరు 13 : పట్టణంలోని షిరిడీ సాయిమందిరంలో శనివారం మహాసమాధి ఆరాధన ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయికృష్ణ భజన సమాజం వారిచే సాయి సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. సాయంత్రం సాయిబాబా మహాసమాధిని ఏర్పాటు చేసి భక్తులకు సమాధి దర్శనం కల్పించారు. కార్యక్రమాలను సాయి మందిర ప్రధానార్చకులు శ్రీనివాసరావు స్వామి, షిరిడీ సాయి సేవా సమితి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చీమకుర్తి రాజగోపాల్, నాగిశెట్టి దామోదర్‌రావులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పొంగులూరు సుబ్బానాయుడు, తరుగు ప్రభాకర్, తోట పెంచలయ్య పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలతో హౌసింగ్ పీడీ భేటీ

కొడవలూరు, అక్టోబరు 13 : నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతలను నెల్లూరు నగరంలోని వారి నివాసంలో హౌసింగ్ పీడీ టీ.వేణుగోపాల్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛం అందచేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందేలా చర్యలు చేపడతామన్నారు. ఆయన వెంట హౌసింగ్ అధికారులు ఉన్నారు.

టీడీపీ సీనియర్ నేత పుల్లయ్యగౌడ్ మృతి



పుల్లయ్య గౌడ్(ఫైల్)

పొదలకూరు, అక్టోబరు 13 : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, రాపూరు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ వెంపులూరు పుల్లయ్య గౌడ్(78) ఆదివారం తుది శ్వాస విడిచారు. ఈయన 14 ఏళ్లు టీడీపీ పొదలకూరు మండల అధ్యక్షులుగా, రాపూరు ఏఎంసీ వైస్ చైర్మన్‌గా, బీసీ సంఘం జిల్లా వైస్ చైర్మన్‌గా సేవలందించారు. గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న పుల్లయ్యగౌడ్ ఆదివారం వారి స్వగ్రామమైన మండలంలోని మర్రిపల్లిలోని ఇంట్లోనే మృతి చెందినట్లు ఆయన కుమారుడు, బీసీ సంఘం మండల నాయకుడు వెంపులూరు రామకృష్ణ తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, మల్లికార్జుననాయుడు, కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, మదిరిశ్ల నరసింహులు, గౌడ సంఘం నాయకులు పుల్లయ్య మృతికి సంతాపం తెలిపారు.

వీధి కుక్కల పట్టివేత

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 13: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ 6,7 వార్డుల్లో వీధి కుక్కల నియంత్రణలో భాగంగా ఆదివారం ఏబీసీ (ఎనిమల్ బర్త్ కంట్రోల్) ఇన్‌చార్జ్ మదన్‌మోహన్, సూపర్‌వైజర్ ప్రవీణ్ నవీన్ సర్వేక్షణలో కుక్కలను పట్టి బంధించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటికి పునరోత్పత్తి కాకుండా ఆపరేషన్లు నిర్వహించి ఎక్కడి కుక్కలను అక్కడ వదిలిపెడతారని నగర పంచాయతీ కమిషనర్ ఎల్. చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.



నగరోత్సవానికి బయలుదేరుతున్న రాజరాజేశ్వరి అమ్మవారు

వైభవంగా విజయదశమి

- విశేష అలంకారాల్లో అమ్మణ్ణి దర్శనం
- కనుల పండువగా నగరోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 13 : విజయదశమి పండుగను శనివారం నగర ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు, పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మణ్ణి నామ ఘోష ఆల యాల పరిసరాల్లో మారుమోగింది. కొన్ని చోట్ల ఆదివారం కూడా ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి.

● రాజరాజేశ్వరి ఆలయంలో ఉదయం నవావరణ పూజ, లలితా కుంకుమార్చన, చండీ యాగ పూర్ణాహుతి జరిగాయి. శమీ పూజ, పారువేట ఉత్సవం నిర్వహించారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సామాన్య భక్తుని వలే క్యూలైనులో అమ్మవారిని దర్శించు కున్నారు. ఏర్పాట్ల గురించి భక్తులను అడిగి తెలుసుకున్నారు. కాగా, ఆలయంలో అల్లూరు గిరీష్‌రెడ్డి, లత, మహేష్‌కుమార్‌రెడ్డి, రాధిక దంపతులు అన్నదానం చేశారు. ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, ఉత్సవ కమిటీ చైర్మన్ అళహరి విజయకుమార్, జిల్లా సహాయ కమిషనర్, ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు. ● కన్యకాపరమేశ్వరి ఆలయంలో శనివారం శమీపూజ, మూలవర్లకు బంగారు చీర అలంకారం, పూలంగిసేవ భక్తులకు కనువిందు చేసింది. రాత్రి పులివాహనంపై అమ్మవారి నగరోత్సవం నయనానందకరంగా జరిగింది. ఆలయ పాలక మండలి పర్యవేక్షించింది. ఆదివారం ఉదయం ఆలయ మాడవీధుల్లో వసంతోత్సవం నిర్వహించారు. రాత్రి ది ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అండ్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరికి దర్బార్ అలంకారం వైభవంగా జరిగింది. ● ఇరుకళల పరమేశ్వరీ ఆలయంలో విశేష పూజలు జరిగాయి. అమ్మవారు ఇరగాళమ్మ అలంకరణలోనే దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ఈవో జే శ్రీనివాసులు పర్యవేక్షించారు. ● మూలస్థానేశ్వర ఆలయంలో భువనేశ్వరీ అలంకారం, ప్రాకారోత్సవం జరిగాయి. శమీ పూజ, పూలంగిసేవ చేశారు. ● ఉస్మాన్‌సాహెబ్ పేట కోదండరామపురంలోని మహాలక్ష్మీకి రాజరాజేశ్వరి అలం కారం జరిగింది. రాత్రి పులివాహనంపై నగరోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్ పత్తి నరసింహం, సభ్యులు పర్యవేక్షించారు. ● మూలాపేట శ్రీకృష్ణధర్మరాజు స్వామి ఆలయంలో శమీ పూజ, పారువేట ఉత్సవాలు జరిగాయి. ● విరాట్‌నగర్ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం, విశేష పూజలు జరిగాయి. నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు పర్యవేక్షిం చారు. నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజుల స్వామి ఆలయంలో పారువేట ఉత్సవం జరిగింది. ● సుజాతమ్మ కాలనీ అష్టలక్ష్మీ ఆలయంలో విజయదశమి సందర్భంగా పూర్ణకళా రాజరాజేశ్వరి అలంకారం జరిగింది. విశేష హోమం, శమీ పూజ నిర్వహించారు. అవధూత దత్తపీఠం నెల్లూరు శాఖ పర్యవేక్షించింది. ● మహాత్మాగాంధీనగర్ శ్రీకృష్ణ మందిరంలో వైభవలక్ష్మీ అమ్మవారికి విజయలక్ష్మీ దేవి అలంకారం, శమీపూజ జరిగాయి. ● అయ్యప్పగుడి గురువాయురప్పన్ మహావిష్ణువు ఆలయంలో మహాలక్ష్మీ అమ్మవారికి విజయలక్ష్మీ అలంకారం, శమీ పూజ జరిగాయి. ఆలయ ధర్మకర్తలు పర్యవేక్షించారు.



నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజుల స్వామి ఆలయంలో పారువేట ఉత్సవం



కన్యకాపరమేశ్వరి ఆలయంలో మల్లెపూలతో దర్బార్ అలంకారం

వేదగిరిపై దసరా వేడుకలు

నెల్లూరు రూరల్ : వేదగిరి క్షేత్రంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం ప్రత్యేక పుష్పపల్లకిలో ఓ లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి అమ్మ వార్లు భక్తులకు దర్శనమిచ్చారు. మూలమూర్తులకు విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. పల్లకిలో ఊరేగుతూ పారువేట అనంతరం గిరిప్రదక్షణ చేశారు. కాగా జిల్లాలోనే ప్రసిద్ధ క్షేత్రాల్లో ఒకటైన వేదగిరిలో దసరా మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. అయితే ఈ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయ ఈవో గోపి అందుబాటులో లేరనే ఆరోపణలు వినిపించాయి. ఉత్సవాలకు సంబంధించిన సామగ్రి పూర్తి స్థాయిలో అందుబాటులో లేదని, అరకొర వసతులు, సేవలతో నవరాత్రి ఉత్సవాలను సిబ్బందే జరిపించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఈవో ను వివరణ కోరగా అమరావతిలోని అమరేశ్వర స్వామి దేవస్థానానికి తాను అదనపు ఇన్‌చార్జిగా ఉన్నందు వల్ల అక్కడ ఉత్సవాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ● దసరా పండుగ సందర్భంగా శనివారం 14వ డివిజన్ పారిశుధ్య కార్మికులకు స్థానిక కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి నూతన దుస్తులు అందచేశారు. పారిశుధ్య కార్మికుల సేవలు మాటల్లో చెప్పలేనివని కొనియాడారు.

పోలీసు విభాగాల్లో ఆయుధ, వాహన పూజ



నెల్లూరు (క్రైం): ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో శనివారం పోలీసు విభాగాల్లో విజయదశమి వేడుకలు జరిగాయి. ఎస్పీ క్యాంపు కార్యాలయం, ఎస్‌బీ, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్, డీపీవో లోని ఎంటీవో విభాగాల్లో వాహన, ఆయుధ పూజలు జరిగాయి. ఎస్పీ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. పోలీసు కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ప్రారంభించారు.

ఎంపీ వేమిరెడ్డితో పీసీబీ చైర్మన్ భేటీ



వేమిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కృష్ణయ్య

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 13 : ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ పీ కృష్ణయ్య ఆదివారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులతో పారిశ్రామికాభివృద్ధికి సంబంధించి పలు విషయాలపై చర్చించారు. కాలుష్య రహిత పరిశ్రమల స్థాపనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు కానుకగా బంగారు హారం



దుర్గమ్మకు రూ. పదిలక్షలు విలువచేసే బంగారు హారం కానుకగా ఇచ్చిన దాతలు పంకజ్‌రెడ్డి, సరిత దంపతులు

విజయవాడ(వన్‌టౌన్), అక్టోబరు 13: ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మకు ఆదివారం నెల్లూరుకు చెందిన వ్యాపారవేత్త పంకజ్‌రెడ్డి, సరిత దంపతులు రూ.10 లక్షల విలువైన బంగారు హారాన్ని కానుకగా సమర్పించారు. ఈవో రామారావు ద్వారా హారాన్ని దేవస్థానానికి అందజేశారు.

నేటి ప్రజా విజ్ఞప్తుల దినం రద్దు

నెల్లూరు(సిటీ), అక్టోబరు 13 : నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరగాల్సిన ప్రజావిజ్ఞప్తుల పరిష్కార వేదికను రద్దు చేస్తున్నట్లు కమిషనర్ సూర్యతేజ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు భారీ వర్షసూచన ఉన్నందు వల్ల ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

విద్యుత్ డిప్లమా ఇంజనీరింగ్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న శేషారెడ్డి

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 13 : ఏపీ పవర్ డిప్లమా ఇంజనీరింగ్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేవీ శేషారెడ్డి అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా టీ వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా పీ దామోదర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రామ్‌ప్రసాద్, జమీలా, కోశాధికారిగా గిరిధర్‌ను ఎన్నుకున్నారు. శేషారెడ్డి మాట్లా డుతూ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి అసోసియేషన్ కృషి చేయాలని కోరారు.

ఘనంగా సాయిబాబా సమాధి ఉత్సవాలు



బాలాజీనగర్ సాయిదర్బార్‌లో నక్షత్ర హారతి

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 13 : నగరంలోని షిరిడీ సాయి మందిరాల్లో బాబా సమాధి ఉత్సవాలు, విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. బాలాజీనగర్ సాయి దర్బార్‌లో శనివారం ఉదయం షిరిడీ హారతులు, ప్రత్యేక అభిషేకాలు, అన్నదానం జరిగాయి. మధ్యాహ్నం బాబా సమాధి వద్ద ప్రత్యేక పూజలు, నక్షత్ర హారతులు జరిగాయి. ఆదివారం బాబా సమాధి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు సాయి సచ్చరిత పారాయణం జరిగింది. మోదెం మల్లికార్జునరావు, భారతి, కనిశెట్టి సురేష్‌బాబు, సరస్వతి, సన్నపరెడ్డి సుకన్య, పాటోలు రామసుబ్బయ్య, మధుసాయి, తదితరులు పాల్గొన్నారు.

● గాంధీబొమ్మ సెంటర్ సమీపంలోని గాంధీ నగర్ సాయిబాబా మందిరంలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సహస్ర నామపూజలు, ప్రత్యేక అలంకారాలు జరిగాయి. మందిరం చైర్మన్ మస్నెం అమరనాథ్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నిజాయితీ

నెల్లూరు (క్రైం), అక్టోబరు 13; వాకింగ్ చేస్తుండగా రోడ్డుపై పడి ఉన్న బంగారు గొలుసును గుర్తించిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆ గొలుసును బాధితులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఓవెల్‌స్కూల్ కరస్పాండెంట్ వేణు నివసిస్తున్నారు. ఆయన కుమార్తె శనివారం సాయంత్రం అన్నమయ్య సర్కిల్ వద్ద స్కూటీ నేర్చుకుంటుండగా ఆమె మెడలోని బంగారు గొలుసు కింద పడిపోయింది. ఇది గమనించని ఆమె ఇంటికి వెళ్లిపోయింది. మెడలో గొలుసు లేకపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు తిరిగి అన్నమయ్య సర్కిల్ వద్దకు వచ్చి వెతికారు. ఇదిలా ఉండగా శ్రీనగర్ కాలనీకే చెందిన ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నరహరి అన్నమయ్య సర్కిల్ వద్ద వాకింగ్ చేస్తుండగా రోడ్డుపై బంగారు గొలుసు కనిపించింది. ఇంతలో గొలుసును పోగొట్టుకున్న వారు రావడంతో దానిని వారికి అప్పగించారు. ఇన్‌స్పెక్టర్‌కు వేణు దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నెల్లూరు రూరల్, అక్టోబరు 13 : ప్రశాంత జీవనం సాగిస్తూ తోటి ప్రజలకు అసౌకర్యం కలుగ కుండా ప్రవర్తించాలని రౌడీ షీటర్లకు నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆదివారం రూరల్ స్టేషన్‌లో రౌడీ షీటర్లతో ఆయన మాట్లా డారు. రౌడీషీట్ ఓపెన్ అయ్యాక వారి నడవడికపై పోలీసు నిఘా ఉంటుందని తెలిపారు. నేరాలకు పాల్పడినట్లు తెలిసినా, ఫిర్యాదులు వచ్చినా జీవితాంతం జైల్లో గడపాల్సి ఉంటుందని హెచ్చరించారు.

అభివృద్ధి ఏమిటో చూపిద్దాం : రూరల్ ఎమ్మెల్యే

నెల్లూరు రూరల్, అక్టోబరు 13 : మనమందరం డివిజన్లలో ప్రజలకు అందుబాటులో ఉంటూ కలిసికట్టుగా పని చేసి అభివృద్ధి అంటే ఏమిటో చూపిద్దామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రూరల్లోని 27వ డివిజన్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ వేణుంబాక సుధాకర్‌రెడ్డి, కుమార్, చలపతి, భాస్కర్, వారి మిత్రబృందాన్ని కండువాకప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పని చేసినప్పుడే డివిజన్లు, గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మురహరి, నాయకులు భాస్కర్, విజయ్ పాల్గొన్నారు.



టీడీపీలో చేరినవారిలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ఏసీ స్టేడియంలో వైద్య సదస్సు

నెల్లూరు (విద్య), అక్టోబరు 13 : వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం వాకర్స్‌కు వైద్య సదస్సు నిర్వహించారు. ప్రముఖ యూరాలజీ నిపుణుడు డాక్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి పాల్గొని కిడ్నీ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డీ సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి కే జయదేవ్, ప్రసాద్, చింతల అమరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా మైపాడు బీచ్ అభివృద్ధి

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కోవూరు : నాగవరప్పమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, అక్టోబరు 13 : మైపాడు బీచ్‌ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. మండలంలోని నరసాపురంలో నెల్లూరు-మైపాడు రోడ్డు విస్తరణ పనులను ఆదివారం ఆమె భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ 18.5 కిలోమీటర్ల నెల్లూరు-మైపాడు రోడ్డు విస్తీర్ణ పనులకు సెంట్రల్ రోడ్డు యాక్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నుంచి రూ.48 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే మైపాడు పర్యాటక కేంద్రంగా మారడంతో పాటు కోవూరు నియోజకవర్గానికి ఒక దిక్సూచిగా మారు తుందన్నారు. ఈ రోడ్డు విస్తీర్ణం వలన 9 గ్రామాల ప్రజల కష్టాలు తీరుతాయని తెలిపారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్, అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. నెల్లూరు, మైపాడు రోడ్డు విషయంలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, వీరేంద్రనాయుడు, చెంచుకిషోర్‌యాదవ్, సురేష్‌నాయుడు, షేక్.ఇంతియాజ్, కైలాసం ఆదిశేషారెడ్డి, బీజేపీ నాయకులు కైలాసం ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు.

నాగవరప్పమ్మ సేవలో ఎమ్మెల్యే

కోవూరు : శరన్నవ రాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా కోవూరు గ్రామ దేవత నాగవరప్పమ్మ గ్రామోత్సవాన్ని శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఘనంగా నిర్వహించారు. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాగవరప్పమ్మ ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఆలయపూజారులు ఆమెకు స్వాగతం పలికి కుంకమపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జెట్టి రాజగోపాలరెడ్డి, పొబ్బారెడ్డి మల్లికార్జునరెడ్డి, అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయిని దర్శించుకున్న ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడ ఆలయాన్ని శనివారం రాత్రి సందర్శించిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మల్లికార్జునస్వామి, కామాక్షితాయిలను దర్శించుకున్నారు. ముందుగా ఈఓ ఏవీ.శ్రీనివాసులురెడ్డి, అర్చకులు ఎమ్మెల్యేని ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం వారి గోత్ర నామాలతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాల అందజేసి వేదపండితులు, పురోహితులు ఆశీర్వదించారు. వారి వెంట ఎంపీడీవో శ్రీహరి, పర్యవేక్షక కమిటీ సభ్యులు అశోక్‌రెడ్డి, పెంచలయ్య, నందకుమార్, హరికృష్ణ, నరసారెడ్డి, నాయకులు ఉన్నారు.

తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



తీర ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ

తోటపల్లి గూడూరు, అక్టోబరు 13 : అల్పపీడనం, తుపాను కారణంగా రాబోయే 3రోజులు జిల్లాకు భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ రవినాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వెంకన్నపాలెం, వెంకటేశ్వర పట్టపుపాళెం, ముత్యాలతోపుపాలెం గ్రామాల్లో ఆదివారం మత్స్యకార ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే 3, 4 రోజులు తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాలు, తుపాను వచ్చినట్లయితే వాటి వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు. మత్స్యకారులు ఎవరు సముద్రంలో వేటకు వెళ్లరాదన్నారు. ఆయన వెంట ఎస్ఐ వీరేంద్రబాబు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలే సీపీఎం లక్ష్యం



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు శేషయ్య

కోవూరు, అక్టోబరు 13 : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా ఉద్యమాలు చేయడమే సీపీఎం లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జి.శేషయ్య అన్నారు. పట్టణంలోని సీతా పోలయ్య కార్యాలయంలో 4వ మండల మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పించాలని, కౌలు రైతులకు గుర్తింపుకార్డులు ఇచ్చి బ్యాంకు రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందించాలని ఉద్యమించడంతో నేడు ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. ఉచిత ఇసుకను వెంటనే అమలు చేయకుంటే ఉద్యమించడం తప్పదన్నారు. జిల్లా నాయకులు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ నిత్యావసర సరుకుల ధరలు అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర వైఫల్యం చెందినట్లు పేర్కొన్నారు. పెట్రోలు, డీజిల్ ధరలు, నూనె ధరలు అమాంతంగా పెరిగిపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జి.బుజ్జయ్య, జె.శేషమ్మ, ఎస్‌కె.బాబు పాల్గొన్నారు.

ఘనంగా 'అంజనీ శ్రీకరం' బ్రోచర్ విడుదల



బ్రోచర్ విడుదల చేస్తున్న వెంచర్ యాజమాన్యం

నెల్లూరు రూరల్, అక్టోబరు 13 : నెల్లూరు రూరల్ పరిధిలోని పెద్ద చెరుకూరు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన అంజనీ శ్రీకరం వెంచర్ బ్రోచర్‌ను ఆదివారం ఘనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈ వెంచర్‌కు అనుసంధానమైన శ్రియ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ డాక్టర్ బాబుఅగస్త్యన్ మాట్లాడుతూ ఈ వెంచర్ మధ్యతరగతి ప్రజల నుంచి ఉన్నత శ్రేణి వారికి అందుబాటులో ఉంటుందన్నారు. పూర్తి ప్రభుత్వ నిబంధనలతో ఏర్పాటు చేయడం వల్ల బ్యాంకు రుణ సదుపాయం కలుగుతుందని తెలిపారు. 7 ఎకరాలలో పార్కు, షటిల్‌కోర్టు, క్లబ్ వంటి ఆహ్లాదకర నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఈ నెలాఖరులోపు ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి రూ.లక్ష విలువ చేసే క్లబ్ మెంబర్ షిప్ ఉచితమన్నారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ రామ్మోహన్, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అచ్యుత్‌రెడ్డి, మురళీరెడ్డి, అనిల్ ఈ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

సర్వేపల్లి సిస్టర్స్‌కి దత్తపీఠం ఆస్థాన విదుషీ బిరుదు



గణపతి సచ్చిదానంద స్వామీజీ, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నుంచి బిరుదును అందుకుంటున్న సర్వేపల్లి సిస్టర్స్

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 13 : నెల్లూరుకు చెందిన డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ కుమార్తెలు డాక్టర్ శ్రేయ, రాజ్యలక్ష్మిలకు మైసూరు దత్తపీఠం ఆస్థాన విదుషీ బిరుదు లభించింది. హైదరాబాద్‌లోని దత్తపీఠం శాఖలో నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. వీటిలో భాగంగా శనివారం జరిగిన విజయదశమి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ వర్మ, దత్తపీఠం అధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ, ఉత్తరాధికారి దత్త విజయానంద స్వామీజీ సర్వేపల్లి సిస్టర్స్‌కు బిరుదు ప్రదానం చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో వారు చేసిన కచేరీని ప్రశంసించారు.



పుష్కరిణిలో చక్రత్తాళారును మునక వేయించిన అర్చకులు, టీటీడీ ఈవో, అదనపు ఈవో తదితరులు - ఆలయంలో గరుడపటాన్ని కిందకు దించుతున్న అర్చకులు


పుష్కరిణి చుట్టూ ఉన్న భక్తులు

బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

● శనివారం ఉదయం చక్రస్నానం.. రాత్రి ధ్వజావరోహణం

తిరుమల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి జరిగిన చివరి ఘట్టమైన ధ్వజావరోహణంతో పరిసమాప్తమయ్యాయి. ఉత్సవాల మొదటిరోజు ధ్వజారోహణం సందర్భంగా గరుడాళ్వార్ ఆహ్వానించిన దేవతలను తిరిగి పంపే కార్యక్రమాన్నే ధ్వజావరోహణం అంటారు. ఈ సందర్భంలోనే తిరిగి వచ్చే బ్రహ్మోత్సవాలకు రావాలని గరుడాళ్వార్ దేవతలను కోరతారని పురాణోక్తి. చివరి రోజైన శనివారం సాయంత్రం ఏడు గంటలకు ఉభయ దేవేరుల సమేతంగా స్వామివారిని బంగారు తిరుచ్చిలో తిరువీధుల్లో ఊరేగించారు. అనంతరం ధ్వజస్తంభం వద్దకు వేంచేపుచేశారు. రాత్రి 9 గంటలకు అర్చకస్వాములు పూజాధికార్యక్రమాలు నిర్వహించి ధ్వజస్తంభంపై ఉన్న గరుడపటాన్ని శాస్త్రోక్తంగా కిందకు దించారు. అనంతరం ధ్వజపడి నివేదన కావించి, ఆలయంలోని బంగారువాకిలిలో ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించారు.

వేడుకగా చక్రస్నానం

శనివారం ఉదయం ఆలయం నుంచి ఉత్సవర్లను తిరుచ్చిలో, చక్రత్తాళ్వార్‌ను పల్లకీలో తిరుమాడ వీధుల్లో ఊరేగింపుగా వరాహస్వామి ఆలయానికి తీసుకొచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి స్నపన తిరుమంజనం, ఇత్యాది కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆ తరువాత చక్రత్తాళ్వార్‌ను అర్చకస్వాములు పుష్కరిణిలో మూడుమునకలు వేయించారు. పుష్కరిణిలో అప్పటికే వేచివున్న వేలాదిమంది భక్తులు గోవింద నామస్మరణలతో స్నానమాచరించారు. అనంతరం ఉత్సవర్లను పల్లకీలో ఆలయం ఆలయానికి వేంచేపు చేశారు. పుష్కరిణి సామర్థ్యం తక్కువగా ఉండే నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో భక్తులను విడదల వారీగా లోపలకు అనుమతించారు. దీంతో ఎలాంటి తోపులాటలు, తొక్కిసలాటలు చోటుచేసుకోలేదు. పుష్కరిణి చుట్టూ పోలీసు, భద్రతా, ఇతర బలగాలతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టడంతో చక్రస్నానం సాఫీగా సాగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జ్యోతిర్మయి, రవినాథ్‌తిల్హరి, నందమూరి వసుంధరదేవి, జన సేన పార్టీ నేత పసుపులేటి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


చక్రస్నానం సందర్భంగా పుష్కరిణిలోకి వస్తున్న భక్తులు

సమష్టి కృషితో విజయవంతం

అధికారులంతా కొత్తయినా.. ప్రణాళికాబద్ధంగా నిర్వహణ

తిరుమల, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంతరాలు, అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో సలక సౌకర్యాలతో భక్తులను వాహనసేవలను కనులారా తిలకించారు. అధికారులు, సిబ్బంది సమిష్టి కృషితో తొమ్మిదిరోజుల ఉత్సవాలు విజయవంతంగా సాగాయి. ఈనెల 4వ తేదీన మొదలైన బ్రహ్మోత్సవాల్లో సీఎం చంద్రబాబు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. రూ.13.45 కోట్లతో నిర్మించిన వకుళామాత సెంట్రల్ కిచెన్‌ను మరుసటి రోజు ప్రారంభించారు. ఇక, ఉత్సవాల్లో తొలి నాలుగు రోజులు భక్తుల రద్దీ సాధారణంగా ఉన్నా.. ఐదవ రోజు గరుడ సేవకు దాదాపు ఐదేళ్ల తర్వాత విపరీత రద్దీ కనిపించింది. రాఘవేంద్రస్వామి మఠానికి సమీపంలోని అదనపు క్యూలైన్ల ప్రవేశంలో గంట పాటు భక్తుల మధ్య తోపులాటలు మినహా.. అంతా ప్రశాంతంగా ముగిసింది. జేఈవో వీరబ్రహ్మం మినహా ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యాచౌదరి, సీవీఎస్వో శ్రీధర్ బ్రహ్మోత్సవాలకు కొత్తే అయినప్పటికీ.. ముందస్తు ప్రణాళిక, సమష్టి కృషితో మంచి ఏర్పాట్లు చేసి సక్సెస్ అయ్యారు. ఈ ఏడాది కళాబృందాల ప్రదర్శనలు చాలా సాధారణంగా జరిగాయి. పెద్దగా మెప్పించలేకపోయారనే భావన వ్యక్తమైంది. దీంతో వచ్చే బ్రహ్మోత్సవాలకు ఉత్సాహవంతులు.. వివిధ రాష్ట్రాలకు చెందిన గ్రామీణ, ప్రముఖ కళాబృందాలను తీసుకురావాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఎప్పటిలానే ఈసారి కూడా విద్యుత్, పుష్పాలంకరణలు భక్తులను మెప్పించాయి. మరోవైపు ఈసారి పోలీసుల బందోబస్తు భారీగా కనిపించింది.

కనిపించని వీఐపీల హడావుడి

ఈసారి ఉత్సవాల్లో వీఐపీల హడావుడి లేకుండా వాహనసేవలు ప్రశాంతంగా జరిగాయి. సీఎం పర్యటనలోనూ పెద్దగా రాజకీయ ప్రముఖులు కనిపించలేదు. తొమ్మిదిరోజుల్లో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు బీవీఎల్ఎన్ చక్రవర్తి, గోపాలకృష్ణారావు, రవినాథ్ తిల్హరి, జ్యోతిర్మయి, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి దుప్పల వెంకటరమణ, కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్, తెలంగాణ పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, నందమూరి వసుంధరాదేవి మాత్రమే వాహనసేవల్లో పాల్గొన్నారు.

ఈ'సారీ' మరుగుదొడ్ల సమస్య

ముందస్తు ప్రణాళికతో ఎన్ని ఏర్పాట్లు చేసినా.. ఈసారి కూడా మాడవీధుల్లో మరుగుదొడ్ల విషయంలో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తాయి. సరిపడా మరుగుదొడ్లు లేకపోవడం, విరిగిపోయిన పైపులు, నీటి కొరత, దుర్వాసనతో గరుడసేవ రోజున భక్తులు ఇబ్బంది పడ్డారు. వీటిని గుర్తించిన అధికారులు శాశ్వత పరిష్కారం దిశగా యోచిస్తున్నారు. గ్యాలరీల విస్తరణపైనా దృష్టిపెట్టారు.

నేటి నుంచి భారీ వర్షాలు

● మత్స్యకారులూ చేపలవేటకు వెళ్లొద్దు

● వాటర్‌ఫాల్స్, బీచ్‌లోకి నో ఎంట్రీ

● ఇబ్బందులుంటే 0877-2236007 నెంబరుకు ఫోనుచేయాలన్న కలెక్టర్


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 13: 'బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. గ్రామస్థాయి నుంచి జిల్లా అధికారుల వరకు అప్రమత్తంగా ఉండాలి. ఆస్తినష్టం, ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి' అని జిల్లా యంత్రాంగానికి కలెక్టరు వెంకటేశ్వర్ సూచించారు. ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి ఆదివారం ఆయన కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. మత్స్యకారులు వేట కోసం సముద్రంలోకి వెళ్లి ఉంటే సత్వరమే వెనక్కి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మూడు రోజులపాటు సముద్రంలోకి చేపలవేటకు మత్స్యకారులు వెళ్లరాదని దండోరా వేయించాలన్నారు. తీర ప్రాంతాలైన గూడూరు, చిల్లకూరు, వాకాడు, కోట, సూళ్ళూరుపేట, తడ తదితర మండలాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ఏ సమయంలోనైనా 0877-2236007 నెంబరుకు ఫోను చేసి సమాచారం ఇవ్వొచ్చని ప్రజలకు సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసి.. పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సెలవుల్లో ఉన్న వారు వెంటనే విధుల్లో చేరాలన్నారు. తిరుపతి నగరంలోనూ మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నాలుగు రోజులపాటు జలపాతాలు, బీచ్‌లకు పర్యాటకులకు అనుమతి లేదని స్పష్టంచేశారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఇక, గూడూరు సబ్‌కలెక్టరు రాఘవేంద్రమీన ఆదివారం తీరప్రాంతాల్లో పర్యటించారు. పొర్లుకట్టలను పరిశీలించారు. అధికారులను, ప్రజలను అప్రమత్తం చేశారు. కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్‌ను సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి పరిశీలించారు.


కోట మండలం పుచ్చలపల్లిలో స్వర్ణముఖినది పొర్లుకట్టలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన

కలెక్టరేట్‌లో నేటి పీజీఆర్ఎస్ రద్దు

భారీ వర్ష సూచన నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కారవేదిక (పీజీఆర్ఎస్)ను రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించి ఎవరూ కలెక్టరేట్‌కు రావద్దని కోరారు. డివిజన్, మండల ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాలనూ రద్దు చేస్తున్నట్టు తెలిపారు.

తలకోనకు రావొద్దు

ఎర్రావారిపాలెం: తుపానుపై వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పర్యాటక కేంద్రమైన తలకోనకు ఎవరూ రావొద్దని ఎస్ఐ ఎర్రిస్వామి కోరారు. నాలుగు రోజులపాటు పర్యాటకులకు అనుమతి నిలిపివేసినట్లు చెప్పారు. తలకోన జలపాతంతో పాటు మాకలరేవు, ధనువు తీసిన బండ ప్రాంతాలకు ఎవరూ వెళ్లరాదన్నారు. పర్యాటకులు, శివ భక్తులెవరు తమ తలకోన పర్యటనను వాయిదా వేసుకోవాలని కోరారు. ఒకవేళ వచ్చినా తలకోన మొదటి వంక వద్దే నిలిపేస్తామన్నారు.

ఎస్వీ వైద్య కళాశాలలో డిప్లొమా కోర్సులకు నేడు కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 13 : ఎస్వీ వైద్య కళాశాలలో డిప్లమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ పారా మెడికల్ కోర్సుల్లో మిగిలిన ఒక్క సీటుకు సోమవారం కౌన్సెలింగ్, స్పాట్ అడ్మిషన్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ జాబితా ప్రకారం గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మాత్రమే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు. ఉదయం 10.30 గంటలకు కళాశాలలోని కార్యాలయానికి హాజరుకాగలరని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 94408 79943కు సంప్రదించాలని తెలిపారు.

ఆర్టీసీకి బ్రహ్మోత్సవాల రాబడి రూ.8.7కోట్లు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 13: శ్రీవారి బ్రహ్మోత్సవాల తొమ్మిది రోజుల్లో ఆర్టీసీ బస్సుల ద్వారా 10,77,273 మంది తిరుమలకు రాకపోకలు సాగించారు. 404 బస్సులు తిరుపతి నుంచి తిరుమలకు 17,233 ట్రిప్పులతో 4,71,914మంది, తిరుమల నుంచి తిరుపతికి 17,295 ట్రిప్పులలో 6,05,359మంది ప్రయాణించారు. 31 ఆక్యుపెన్సీ రేషియోతో రికార్డు స్థాయిలో రూ.8.7కోట్లు సమకూరినట్లు ప్రజా రవాణాధికారి చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు.

హైదరాబాదు, బెంగళూరుకు అదనపు బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 13: దసరా సెలవులు ముగిసిన నేపథ్యంలో ఆర్టీసీ హైదరాబాదు, బెంగళూరులకు 29 అదనపు సర్వీసులు ఏర్పాటు చేసింది. బెంగళూరుకు 23 (8సూపర్ లగ్జరీలు, 2 అల్ట్రా డీలెక్స్‌లు, 12 ఎక్స్‌ప్రెస్‌లు) బస్సులు కేటాయించింది. ఇవి సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకు వివిధ సమయాలలో బయలుదేరి వెళ్లాయి. హైదరాబాదుకు 6 (అమరావతి 1, సూపర్‌లగ్జరీలు 2, అల్ట్రా డీలెక్స్‌లు 3) బస్సులు కేటాయించగా సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.30మధ్య పయనమయ్యాయి. సాధారణ ఛార్జీలనే వసూలు చేయగా పూర్తి ఆక్యుపెన్సీ రేషియో నడిచాయి. సోమవారం రద్దీని అనుసరించి అదనపు సర్వీసులు నడపనున్నట్లు బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు తెలిపారు.

'లక్కు' ఎవరికో?

● నేడు లాటరీ ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు

● తిరుపతి శిల్పారామం వేదిక

● ఉదయం 7 గంటలకంతా ఎంట్రీ పాసులతో రావాలన్న ఈఎస్

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 13: జిల్లాలో మద్యం 227 మద్యం దుకాణాలకు 3915 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఎవరిని 'లక్కు' వరించనుందో నేడు తేలిపోనుంది. తిరుపతి శిల్పారామంలోని ఏసీ హాలులో సోమవారం ఉదయం 8 గంటల నుంచి కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ద్వారా డిప్ తీసి మద్యం దుకాణాలను కేటాయించనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎక్సైజ్ సూపరిటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు. శిల్పారామం హాలు నెంబరు 1లో తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, శ్రీకాళహస్తి, పుత్తూరు, నాగలాపురం, చంద్రగిరి ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని మద్యం దుకాణాలకు సంబంధించి లాటరీ తీయనున్నారు. హాలు నెంబరు 2లో గూడూరు డివిజన్‌కు సంబంధించి గూడూరు, నాయుడుపేట, సూళ్ళూరుపేట, వాకాడు, వెంకటగిరి ఎక్సైజ్ స్టేషన్లకు సంబంధించి మద్యం దుకాణాలకు లాటరీ తీస్తారు. దీనికిగాను దరఖాస్తుదారులు ఉదయం 7 గంటలకంతా శిల్పారామం వద్దకు చేరుకోవాలి. ఎంట్రీ పాసు, ఐడెంటిటీ ప్రూఫ్ కార్డులు తీసుకురావాలి. ఒకవేళ అభ్యర్థులు రాలేకుంటే.. వారి తరఫున హాజరయ్యే వారి ధృవీకరణ పత్రం, ఐడెంటిటీ కార్డు, ఎంట్రీ పాసుతో హాజరుకావాలి. లాటరీ ద్వారా దుకాణాలు పొందిన వారు లైసెన్సు ఫీజు మొదటి కంతును శిల్పారామంలో ఏర్పాటు చేసిన బ్యాంకు కౌంటర్లలో చెల్లించి లైసెన్సు పొందాలని ఎక్సైజ్ అధికారులు సూచించారు. శిల్పారామం వద్ద అదనపు ఎస్పీలు, ఐదుగురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, దాదాపు 300 మంది పోలీసులు, ఎస్టీఎఫ్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎవరైనా గలాటాలు చేయాలని ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు.



'మందు' బాదుడు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 13: ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని కొందరు సిబ్బంది మందుబాబులను బాదేస్తున్నారు. మంగళవారంతో ఈ దుకాణాలు మూతపడి.. బుధవారం నుంచి ప్రైవేటు మద్యం షాపులు రానున్నాయి. దీంతో వీరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. క్వార్టర్ బాటిల్‌పై రూ.15 నుంచి రూ.20 వరకు పెంచి అమ్ముతున్నారు. పలుచోట్ల మందుబాబులు ఆందోళనకు కూడా దిగారు. ఎలాగూ 15వ తేదితో తమ ఉద్యోగాలు పోతున్నాయన్న క్రమంలో చాలా చోట్ల పది రోజులుగా మద్యం కొరతను సృష్టించి రేటు పెంచి అమ్ముతున్నారు. కొందరైతే పోయే ఉద్యోగం ఉంటే ఎంత...పోతే ఎంత అనుకుని మద్యం నిల్వలను బెల్టు షాపులకు తరలించారు. ఈ విషయమై ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళగా టాస్క్‌ఫోర్సు స్క్వాడ్‌ను పంపి కేసులు నమోదు చేస్తామని చెప్పారంతే. మద్యం బాదుడు మాత్రం ఆగలేదు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం వద్ద తెగిపోయిన పొర్లుకట్టలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

వాకాడు, అక్టోబరు 13: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనంతో అల్పపీడనంగా మారి ఈనెల 14, 15, 16 భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో మండల అధికారులను సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అప్రమత్తం చేశారు. ఆదివారం ఆయన మండలంలో పర్యటించారు. గత ఏడాది డిసెంబరులో మిచౌంగ్ తుఫాన్‌తో బాలిరెడ్డిపాళెం వద్ద స్వర్ణముఖినది వద్ద తెగిపోయిన పొర్లుకట్టలను పరిశీలించారు. పొర్లు కట్టలు నిర్మాణదశలో ఉండటంతో కాంట్రాక్టర్లను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బాలిరెడ్డిపాళెం వద్ద ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన షెల్టర్‌ను తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణారావుతో కలసి పరిశీలించారు. భారీ వర్షం కురిసి పిడుగులు పడే అవకాశం ఉండటంతో వ్యవసాయదారులు, పశువుల కాపర్లు, మత్స్యకారులు బయటకు వెళ్లవద్దని సూచించారు. ఆయన వెంట ఇరిగేషన్ ఏఈ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఉన్నారు.

కోట: మండల పరిధిలోని పుచ్చలపల్లిలో స్వర్ణముఖినది పొర్లుకట్టలను సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా పరిశీలించారు. పుచ్చలపల్లి దొరువుకట్ట మార్గంలో కట్టలు బలహీనంగా ఉన్నాయని, ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం సముద్రం ఒడ్డున ఉన్న గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామాన్ని సందర్శించి మత్స్యకారులతో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లోతట్టు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు షెల్టర్లను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా పునరావాస కేంద్రాల వద్ద నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచాలన్నారు. తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాని ఆదేశించారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, వివిధశాఖల అధికారులు ఉన్నారు.

తుఫాన్ అప్రమత్తతపై సమీక్ష



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

సూళ్లూరుపేట, అక్టోబరు 13: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, ఇది అల్పపీడనంగా మారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ఆర్డీవో కిరణ్మయి ఆదివారం తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎటువంటి విపత్తు జరిగిన ఎదుర్కొనేందుకు అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తీరప్రాంత గ్రామాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేసేందుకు ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి 08623-295345 ఫోన్ నెంబరు అందుబాటులో పెట్టామన్నారు. అనంతరం ఆమె కేవీబీపురం మండలంలో కాళంగి రిజర్వాయర్‌ను అధికారులతో కలసి పరిశీలించారు. ఏవో రవికుమార్, ఎస్‌ఐ బ్రహ్మానాయుడు తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి: అల్పపీడనం కారణంగా రాబోయే మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు వివిధ శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. ఆదివారం ఆయన తన కార్యాయంలో అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. తుఫాను కారణంగా మూడు రోజులు పాటు భారీ వర్షాలు కురిపే అవకాశాలు వున్నందున వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లోనే వుంటూ ప్రజలును అప్రమత్తం చేయాలని సూచించారు. డక్కిలి రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి పరిపరిస్థితినైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా వుండాలని కోరారు. అన్ని శాఖల సిబ్బంది ఎవ్వరూ సెలవులు పెట్టరాదని సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువుల స్థితిగతులను తెలుసుకొని రైతులను అప్రమత్తం చేయాలని కోరారు.

గూడూరు అర్బన్: తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆదివారం కలెక్టర్ వెంకటేశ్వర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మధుసూదనరావు మాట్లాడుతూ ఈనెల 14నుంచి 17వ తేదీ వరకు బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తుఫాన్ వచ్చే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాయుడుపేట: తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావారణశాఖ హెచ్చరించడంతో కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను అప్రమత్తం చేశారు. ఆదివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దారు గీతావాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు. 15, 16, 17 తేదీల్లో భారీ వర్షాల సూచన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఎన్నిక



నూతన కమిటీతో షార్ మాజీ డైరెక్టర్ నారాయణ తదితరులు

సూళ్లూరుపేట, అక్టోబరు 13: సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థులు సమావేశం జరిగింది. షార్ మాజీ డైరెక్టర్ కె.నారాయణ, పలువురు ప్రముఖులు విచ్చేశారు. కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ ఏ.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా ఎల్.శ్రీనివాసులు, వి.శివకుమార్‌రెడ్డి, కార్యదర్శిగా టి.ఆదినారాయణరెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎస్‌కే ఉస్మాన్ భాషా, ట్రెజరర్‌గా బి.ధనుంజయరెడ్డితో పాటు 11మంది సభ్యులను ఎన్నుకొన్నారు.

సాహితీవేత్తలు, రైతులకు గార్లపాటి పురస్కారాలు

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 13: స్థానిక రాస్ భవనంలో ఆదివారం గార్లపాటి పురస్కారాలు ప్రదానం చేశారు. సాహితీ ప్రక్రియల్లో విశేష కృషి చేసిన లంకిపల్లి కన్నయ్య నాయుడు, డాక్టర్ రామలక్ష్మి, జిల్లెళ్ల బాలాజీ, గుడివాడ అన్నయ్య నాయుడు, పేరూరు బాలసుబ్రమణ్యం, ఆదర్శ రైతులు కోటపాటి గంగాధరం, నరసింహులునాయుడుకు పురస్కారాలు ప్రదానం చేశారు. రూ.ఐదువేల నగదు, జ్ఞాపిక, శాలువలతో సత్కరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ తల్లిదండ్రుల పేరుతో సమకాలీన సాహితీవేత్తలను సత్కరించడం మంచి సంప్రదాయమన్నారు. విశ్రాంత ఆచార్యులు కె.సర్వోత్తమరావు మాట్లాడుతూ సాహితీ రచన మనిషి వ్యక్తిత్వానికి, వికాసానికి గీటురాయని, సమాజాన్ని ముందుకు నడిపిస్తుందని పేర్కొన్నారు. మరొక అతిథి డాక్టర్ లింగుట్ల రమేష్ నాథ్ మాట్లాడుతూ తెలుగుభాషా సేవకులైన కవులు, రచయితలను పురస్కారాలతో సత్కరించడం మంచి సంప్రదాయమన్నారు. సభకు ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు అధ్యక్షత వహించగా, శతావధాని ఆముదాల మురళి, ఏనుగు అంకమనాయుడు పురస్కార గ్రహీతలను సభకు పరిచయం చేశారు. వేమూరి జయరామ్ ప్రసాద్, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, సాకం నాగరాజ, యువశ్రీమురళి, కంపల్లి రవిచంద్రన్, ఆర్‌సీ కృష్ణస్వామి రాజు, గాలి గుణశేఖర్, తోట వెంకటేశ్వర్లు, ఆకుల మల్లేశ్వరరావు, మస్తానమ్మ పాల్గొన్నారు.











గూడూరు: గ్రామోత్సవంలో విజయదుర్గాదేవి, నారాయణమ్మ, మహాలక్ష్మమ్మ, బజారు కలశం దుర్గాదేవి, ద్రౌపదీదేవి

వైభవోపేతం... అమ్మవార్ల గ్రామోత్సవం



సూళ్లూరుపేట: చెంగాళమ్మ గ్రామోత్సవం



గూడూరు: ధర్మరాజస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పూజలు



నాయుడుపేట టౌన్: ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు కుబేరు మణి

గూడూరు, అక్టోబరు 13: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి పట్టణంలో అమ్మవార్ల గ్రామోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించారు. నవరాత్రుల్లో భాగంగా తొమ్మిరోజుల పాటు అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. శనివారం రాత్రి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై ఉంచి కలశోద్వాసనకు తరలించి గ్రామోత్సవం జరిపారు. స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో అమ్మవారిని, నారాయణమ్మ ఆలయంలో అమ్మవారిని, రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవార్లను రాజరాజేశ్వరిదేవిగా, ధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదిదేవిని, బజారుకలశంలో దుర్గాదేవి అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. వాలయనందాపురం, బొడ్డు చౌక, వీరారెడ్డిపల్లిలోని మహాలక్ష్మమ్మ అమ్మవార్లను శక్తి రూపంలో ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. కేరళవాయిద్యాలు, మంగళమేళాలు, తప్పెట్లు తాళాలు, పార్వతీమహిషాసుర యుద్ధ నృత్యాలు, కోలాటాలు, కీలుగుర్రాల నృత్యాలు, జింగిరిమేళాలు, తెనాలి బ్యాండ్ మ్యూజిక్, యువత చిందుల నడుమ బాణసంచా పేల్చుతూ పట్టణపుర వీధుల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు ఊరేగించారు. ఈ నెల మూడో తేది నుంచి కలశ స్థాపనతో ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు అమ్మవార్ల కలశోద్వాసనతో ఆదివారం ముగిశాయి. స్థానిక ధర్మరాజస్వామి ఆలయం వద్ద ద్రౌపదీదేవికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పూజలు నిర్వహించారు. గ్రామోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ రమణకుమార్ పర్యవేక్షణలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓజిలి: మండలంలో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఓజిలి, మానమాల, కురుగొండ, ఆరిమేనిపాడు, అత్తివరం, చిల్లమానుచేను, సగుటూరు గ్రామాల్లోని దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మూకాంబికాదేవి రాజరాజేశ్వరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, పార్థసారధి దంపతులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే దంపతులను టీడీపీ నాయకుడు కుబేరు మణి శాలువాకప్పి సన్మానించారు.

నాయుడుపేట: విజయదశమి పురష్కరించుకుని పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి, పోలేరమ్మ, ముకాంభికాదేవి ఆలయాలతో పాటు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముకాంభికాదేవి ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించి ప్రత్యేక పూజల్లో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా రూరల్ అధ్యక్షుడు గూడూరు కిషోర్ కుమార్, గౌరవ అధ్యక్షుడు పెనల జయరాజ గోపాల్ తదితరులు అందజేసిన చీర, సారెను ఆర్యవైశ్య మహాళలకు అందజేశారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ విజయదశమి రోజున శనివారం మహిషాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులు పట్టువస్త్రాలు, సారె సమర్పించారు. ఉదయం మహాచండీయాగం నిర్వహించారు. రాత్రి గ్రామోత్సవం జరిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యహరించారు. సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవ నాయుడు, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

కోట: గ్రామదేవత కోటమ్మకు శనివారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు చేసి గ్రామోత్సవం, పల్లకీ సేవ నిర్వహించారు.







నాయుడుపేట టౌన్: రాజరాజేశ్వరీదేవి అలంకరణలో మూకాంబికాదేవి - కోట: కోటమ్మ ఊరేగింపు - గూడూరు: గ్రామోత్సవంలో పార్వతి, మహిషాసుర నృత్యాలు

గుర్తుతెలియని వాహనం ఢీకొని హోటల్ మేనేజర్ మృతి



మధురెడ్డి (ఫైల్‌ఫొటో)

చిల్లకూరు, అక్టోబరు 13: మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలోని కోల్డ్ స్టోరేజ్ వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం మోటారు సైకిల్‌ను ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... ముత్తుకూరు మండలం పంటపాళెం గ్రామానికి చెందిన మధురెడ్డి (54) రైటాసత్రం వద్ద ఉన్న ఓ ప్రైవేటు హోటల్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ స్థానిక కోకోల్ గార్డెన్‌లో నివాసముంటున్నాడు. శనివారం రాత్రి హోటల్ నుంచి మోటారుసైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. మధురెడ్డి తీవ్రంగా గాయపడడంతో స్థానికులు నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మధురెడ్డి భార్య కుమార్తె, కొడుకు ఉన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

ఒకరి మృతి, నలుగురికి గాయాలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 13: నాయుడుపేట - చంద్రబాబు కాలనీ జాతీయ రహదారి సమీపంలో ఆటోను కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా నలుగురికి గాయాలయ్యాయి. మండలంలోని అన్నమేడు గ్రామానికి చెందిన నలుగురు మహిళలు ఆటోలో ఆదివారం సూళ్లూరుపేటలో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. చంద్రబాబుకాలనీ జాతీయ రహదారికి సమీపంలోకి రాగానే వెనుక వైపు నుంచి కారు ఢీకొంది. ఈప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న శాంతమ్మ (62) అక్కడికక్కడే మృతి చెందింది. ఆటో డ్రైవర్ శంకర్, కుమారి, రత్న, శైలజకు గాయాలయ్యాయి. శాంతమ్మ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యానగర్‌లో పాస్టర్స్ డే సంబరాలు

కోట, అక్టోబరు 13: మండల పరిధిలోని విద్యానగర్‌లో గల హోలిప్రేయర్ చర్చిలో ఆదివారం పాస్టర్స్ డే సంబరాలు జరిగాయి. బిషప్ డాక్టర్ ఎంజే ప్రదీప్‌కుమార్, పాస్టర్ బెన్నీలను ఆధ్వర్యంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల సంఘ కాపరులు, సభ్యులు కేక్‌కట్ చేశారు.

ఆకట్టుకున్న ఎడ్ల పందేలు

వాకాడు, అక్టోబరు 13: మండల పరిధిలోని ఐటీఐ ప్రాంగణంలో దసరా సంబరాలను పురస్కరించుకొని ఆదివారం వాకాడు గ్రామస్తులు ఎడ్ల పందేలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి ఎడ్ల పందేలను ప్రారంభించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.5.24 కోట్లు

తిరుమల, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రెండు రోజుల్లో రూ.5.24 కోట్లు లభించింది. గురు, శుక్రవారాల్లో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక శుక్ర, శనివారాల్లో 1.45 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుచానూరు. అక్టోబరు 13: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ జ్యోతిర్మయి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయాధికారులు స్వాగతం పలికారు. న్యాయమూర్తి ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి, మూలమూర్తిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

రైళ్ల రాకపోకల పునరుద్ధరణ



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్

తడ, అక్టోబరు 13: చెన్నై - సూళ్లూరుపేట మధ్య రైళ్ల రాకపోకలను కొంతమేర పునరుద్ధరించారు. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా కవరైపేట రైల్వేస్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి లూప్‌లైన్‌లో ఆగివున్న గూడ్సు రైలును మైసూరు నుంచి దర్భంగాకు వెళ్తున్న బాగ్మతి ఎక్స్‌ప్రెస్ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎక్స్‌ప్రెస్ రైలుకు చెందిన రెండు ఏసీ బోగీల్లో మంటలు చెలరేగాయి. మరో 10 బోగీలు పట్టాలు తప్పాయి. దీంతో చెన్నై - సూళ్లూరుపేట మధ్య రైళ రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రెండు ట్రాక్‌లు దెబ్బతినడంతో సదరన్ రైల్వే అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. శనివారం రాత్రి 8 గంటల సమయానికి అప్‌లైన్‌లను పునరుద్ధరించగలిగారు. అప్పటి నుంచి ఒకే లైన్‌లో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడిపారు. ఆదివారం ఉదయానికి రెండో లైన్ ట్రాక్ పనులను పూర్తిచేసి అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడిపారు. ప్రస్తుతం లూప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. సూళ్లూరుపేట - చెన్నై - నెల్లూరు మధ్య నడిచే లోకల్ మెమో రైళ్లను సోమవారం నుంచి నడపనున్నట్లుగా తెలిసింది. దసరా పండగ వేళ ప్రమాదం కారణంగా రైళ్ల రద్దు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రైళ్ల రద్దుతో ఆర్టీసీ బస్సులన్నీ కిటకిటలాడాయి.

టీడీపీ నేత రఫీకి పితృవియోగం



చాన్‌బాషా మృతదేహానికి నివాళులర్పిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, అక్టోబరు 13: టీడీపీ నేత, మున్సిపల్ వైస్‌చైర్మన్ రఫీకి పితృవియోగం కలిగింది. రఫీ తండ్రి చాన్‌బాషా(62) ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, అమృత సరళ దంపతులు చాన్‌బాషా మృతదేహానికి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు నెలవల రాజేష్, చక్రపాణి, జనసేన నాయకులు ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, రాజేంద్ర, పసల చెంగయ్య తదితరులు కూడా నివాళులర్పించారు.

ఎమ్మెల్యే చొరవతో పాఠశాలలో అభివృద్ధి పనులు



పాఠశాల ఆవరణను చదును చేయిస్తున్న హెచ్‌ఎం, స్థానికులు

చిల్లకూరు, అక్టోబరు 13: మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చొరవతో అభివృద్ధి పనులు చేపట్టారు. గతంలో గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు వర్షాల సమయంలో పాఠశాల ఆవరణలో వర్షపునీరు నిల్వచేరి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని సిబ్బంది తెలిపారు. ఆదివారం పాఠశాలలో మట్టిని తోలి చదును చేసే పనులు చేపట్టడంతో పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయుడు మాధవయ్య, వేణుగోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి



దయాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న నరేంద్రరెడ్డి తదితరులు

పెళ్లకూరు, అక్టోబరు 13: ప్రధాని మోదీ పాలన పట్ల ఆకర్షితులైన ప్రజలు బీజేపీ క్రియాశీలక సభ్యత్వం తీసుకుంటున్న క్రమంలో తిరుపతి జిల్లాను సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని తాళ్వాయిపాడులో ఎద్దల నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే సభ్యత్వ నమోదులో జిల్లా మూడో స్థానంలో ఉందన్నారు. నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో మొదటి స్థానంలో ఉండేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోగుతోటి మురళి, సురేష్‌రెడ్డి, నరసింహులు తదితరులు ఉన్నారు..

పల్లె పండుగ వారోత్సవాలను విజయవంతం చేద్దాం: జనసేన



మీడియాతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

కోట, అక్టోబరు 13: మండలంలోని గ్రామాల్లో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జరిగే పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్‌రావు కోరారు. కోటలోని గ్రామదేవత కోటమ్మను ఆదివారం జనసేన నాయకులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గం గ్రామసభల్లో ఆమోదం పొందిన పనులు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభం అవుతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు భాగస్వామ్యం కావా లన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మోహన్, బాలసుబ్రహ్మణ్యం, శివకుమార్, క్రాంతి, భాస్కర్, వెంకయ్య, మనోజ్‌కుమార్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

25నుంచి హాకీ శిక్షణ

గూడూరు అర్బన్, అక్టోబరు 13: కాకినాడలోని డీఎస్‌ఏ స్టేడియంలో ఈనెల 25నుంచి నవంబరు 2వ తేదీ వరకు హాకీ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిరాజు తెలిపారు. ఈ ఏడాది జూన్‌లో హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ధర్మవరంలో సీనియర్ పురుషుల ఛాపియన్‌షిప్ పోటీలు నిర్వహించి రాష్ట్రస్థాయి జట్టును ఎంపిక చేయడం జరిగిందన్నారు. వారికి కాకినాడలో శిక్షణ ఇవ్వనున్నట్లు రవిరాజు తెలిపారు.

లారీ ఢీకొని యాచకుడికి గాయాలు

చిల్లకూరు, అక్టోబరు 13: మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో ఆదివారం లారీ ఢీకొని యాచకుడికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు... వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో భిక్షాటన చేసుకునే యాచకుడు సమీపంలోని జాతీయ రహదారి పక్కన నిలబడివుండగా చెన్నై నుంచి నెల్లూరు వైపు వెళుతున్న లారీ ఢీకొనింది. యాచకుడికి గాయాలవడంతో 108 వాహనంలో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.